# మిసిమి

మాస పత్రిక

జూన్ - 2000



వెల-రూ. 8/-



**టైపాలో**
**1696-1770**

## చిత్రకారుని గురించి

ఇటాలియన్ రొకొకొ శైలి అత్యద్భుతంగా అభివ్యక్తీకరించిన చిత్రకారుడు టైపాలో. ఇతడు వెనిస్‌లో 1696లో ఓడ వ్యాపారికి జన్మించాడు. ఇతనికి ఒక ఏడాది వయస్సు ఉన్నప్పుడే తండ్రి మరణించాడు. చిన్నతనం లోనే ఒక అనామకుడైన చిత్రకారుని దగ్గర చిత్రలేఖనం అభ్యసించాడు. ఇతనికి ఇరవై ఏళ్ళు వచ్చేసరికి మంచి పేరు ప్రతిష్ఠలు ఆర్జించాడు. తైల వర్ణ చిత్రాలను ప్రదర్శించాడు. ఆ తరవాత కొద్ది కాలంలోనే కుడ్య చిత్ర లేఖనం వైపుకు దృష్టి మరలించాడు. ఈ మాధ్యమంలోనే ఇతడు అద్భుతమైన కుడ్య, సీలింగు చిత్రాలను చిత్రించాడు. ఈ కుడ్య, సీలింగు చిత్రాలకు టైపాలో వెలుగు నీడల ఛాయా ప్రభావాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. అంతకు ముందు ఎవరూ చేయలేని రీతిలో దర్శకునిలో ఒక భ్రాంతి (illusion) కలిగేట్లు చేయగలిగాడు.

అనతి కాలంలోనే ఇతడు అంతర్జాతీయ ఖ్యా తిని ఆర్జించాడు. చిత్ర లేఖనంలో ఇతడు శిఖరాగ్రం మీద ఉన్నప్పుడు, జర్మన్ రాకుమారుడు బిషప్ వుర్జ్‌బర్గ్ నుండి రాజప్రాసాదాన్ని అలంకరించవుని ఆహ్వానం వచ్చింది. టైపాలో చివరికి చేసింది మాడ్రిడ్‌లోని స్పానిష్ రాజప్రాసాదాలంకరణ. ఇతడు 1770లో మరణించాడు.

ముఖచిత్రం : **మాండలిన్‌తో యువతి**

చివరిపేజీ చిత్రం : **రామచిలుకతో యువతి**

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 12 | జూన్ 2000 | సంచిక 6

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక

ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ - బి. తిరుపతిరావు

ప్రపంచం ఇంతగా మారినా
ఆడవాళ్ళకు అంతా అందంలోనే ఉందా? - మిసిమి వర్క్‌షాప్

విలువలు లేని ప్రమాణాలు వ్యర్థం - కె. కృష్ణమూర్తి

బలివాడ కాంతారావు నవలలు - ఇతివృత్తం - అర్దంకి శ్రీనివాస్

'వజ్రసూచి కర్తృత్వం' - టి. రవిచంద్

'నూతి'లో గొంతుకల 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం! - నరేష్ నున్నా

జానపద సాహిత్యంలో - స్త్రీ - దస్తగిరి

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **మాండలిన్‌తో యువతి**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536
e-mail : misimi_m@hotmail.com
http : //www.misimi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# A JUBILEE OF JOKES

**- By K.K. Khullar**

It is rather ironic that the best "Punjabi" jokes are heard outside Punjab and are enjoyed by all except Punjabis. It is doubly ironic that during the last 50 years these jokes have been transferred to the Baluch, the Pathans, the Afghans and to an extent to the Central Asian republics of the erstwhile Soviet Union.

Ask anyone where his "dhori" was born and he knows that a joke about Punjabis is coming. Ask a Poorbia where the smallest coin was invented and he knows for certain that a joke about Hoshiarpur is up the sleeve. Ask a Mumbai-wallah where the first "driver" of the world was born and he knows what is going to follow. In Mumbai's cine world there are scores of Punjabi jokes about the hair of Dilip Kumar, the affairs of Raj Kapoor, the "dupatta" of Meena Kumari and the "guts" of Dharmendra. A stray reference to Dev Anand and Gurdaspur can let loose a hundred jokes on the town which was Dev Anand's home town, where residents stop their clocks at night to enjoy sound sleep, where women wear only socks and men wear only shoes.

The women of pre-Partition Lahore were known for their meanness in money matters. "The meals are ready, Bhai Sahib, and so is the train" was the common welcome to the unwelcome guests in the town. Translated into Punjabi-Lahori it meant: "Roti tayar hai par gaddi vi tayar ye".

Old time Punjabis get so mad about Lahore that they say "Lahore is Lahore'. But I have never found Lahore worth a memory. It was a city of the elite, of zamindars, it was a city representing feudal culture. I really do not know why Punjabis get so excited at the mere mention of Lahore. Besides Lahore witnessed the worst scenes of Partition. So I am ignoring other jokes about Lahore.

The girls of Gujranwala were foot-loose but were known for subtlety of wit and suppleness of body. They insisted on "bohini" (first sale). They were adept in "gulli-damda". They specialised in "Shatapu" (high jump). Ah, what a jump!

Come to Amritsar and you have Saadat Hasan Manto, a native of that town, telling you the "nizakat" (sophistication) of the sweepresses (now known as the safai karmacharis) of that city. He would also tell you something "terrible" about the midwives of Batala and the vegetable sellers of Wazirabad, a town on the Grand Trunk Road founded by a tipsy Wazir (Minister) of Ranjit Singh. Mind you he was not a Punjabi, but from Italy, a General Ventura.

At Daska district in Sialkot where I have spent my childhood, peasants used to put green spectacles on the eyes of their animals so that they took hay for green grass. But the Punjabi horses and bulls were equally clever. After taking hay they demanded green grass. The peasant women of Daska were known for their ribald humour and they never resented their reputation.

Onion Jokes of Sialkot are legion. I relished those jokes as I relished my roti

*Continue - 166*

# ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ (Frankfurt School)

- బి. తిరుపతిరావు

ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ అనేది 1923లో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లోని విశ్వవిద్యాలయంలో ఒక మార్క్సిస్టు అధ్యయన సంస్థగా, పరిశోధనా సంస్థగా ప్రారంభమయింది. 1920లలో ఈ సంస్థ అధిపతిగా వున్న కార్ల్ గ్రన్డెన్‌బర్గ్ (Carl Grundenberg) నాయకత్వంలో అనుభవ సిద్ధవాద కేంద్రంగా పరిశోధనలు నడిచాయి. ఐరోపా కార్మికవర్గ సమస్యల గురించిన పరిశీలనలు చేయటం జరిగింది. ప్రారంభంలో ఈ సంస్థ నడిపిన పత్రికలో Karl Karsch, George Lukacs లాంటి వాళ్ళుకూడా రచనలు చేశారు.

1930లలో మాక్స్ హర్క్‌హైమర్ (Max Hork Heimer) ఈ సంస్థకి డైరెక్టర్ అయిన తరువాత ఎరిక్‌ఫ్రాం, హెర్బర్ట్ మార్క్యూజ్, థియోడర్ అదార్నో లాంటి మేధావులు ఈ సంస్థలో క్రియాశీలపాత్ర నిర్వర్తించారు.

ఈ కాలంలోనే సామాజిక మార్పుకి ఒక సాధనంగా ఉపయోగపడగలిగే సామాజిక సిద్ధాంతాన్ని రూపొందించే ప్రయత్నం తీవ్రంగా చేయటం జరిగింది. తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రం, సాంస్కృతిక అధ్యయనాలు, రాజకీయ ఆర్థిక శాస్త్రం మొదలైన బహుళ అంశాల సమ్మేళనంగా ఒక కొత్త విమర్శనా సిద్ధాంతాన్ని రూపొందించే ప్రయత్నంలో ఈ సంస్థ సభ్యులు తీవ్రంగా కృషిచేశారు.

1920-30ల మధ్య ఈ సంస్థ కార్యకలాపాలకి మార్క్సిజంలోని కొన్ని అంశాల గురించిన మౌలిక చర్చలు, సమాజంలో అమలులోవున్న అన్ని ఆధిపత్య రూపాల్ని విమర్శనాత్మకంగా విశ్లేషించటం, పశ్చిమ ఐరోపాలో వామపక్ష కార్మికోద్యమం వోడిపోవటం, జర్మనీలోని వామపక్షపార్టీ సంస్కరణవాద పార్టీలుగా మారటం, ఆ పార్టీలు దాదాపు రష్యా చెప్పు చేతల్లో నడవటం, నాజీయిజం, ఫాసిజంలు తీవ్రరూపంలో ముందుకు రావటం, రష్యన్ కమ్యూనిస్టు విప్లవం స్టాలినిజంగా రూపాంతరం చెందటం మొదలైనవన్నీ నేపథ్యంగా వున్నాయి.

హర్క్‌హైమర్ డైరెక్టర్‌గా వున్న కాలంలో ఈ సంస్థ తన మొదటి ప్రాజెక్ట్‌గా అధికారాన్ని నిర్దిష్టంగా పరిశీలించటం, అహేతుక ఆధిపత్యానికి ఉదాసీనంగా ప్రజలు ఎందుకు లొంగిపోతున్నారో విశ్లేషించటం, అసలు అధికారవాద వ్యవస్థలు ఎలా మనగలుగుతున్నాయో పరిశీలించటం, వాటిని గురించిన రచనలు ప్రచురించటం జరిగింది. 1930లలో సంస్థ దృష్టి ప్రధానంగా ఫాసిజం మీద కేంద్రీకరించటం జరిగింది. హిట్లర్ అధికారంలోకి రాగానే చాలామంది యూదులతోపాటు, ఈ సంస్థకు చెందిన సభ్యులు, ఇంకా అనేక మంది మార్క్సిస్టులు జర్మనీ వదిలి పోవాల్సిన పరిస్థితి

ఏర్పడింది. ఈ స్థితిలో సంస్థ సభ్యులలో ఎక్కువ మంది అమెరికాకి వలస పోవటం జరిగింది. అయితే అక్కడ కూడా ఈ స్కూలు కొలంబియా విశ్వవిద్యాలయం కేంద్రంగా పని చేసింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరవాత పరిస్థితుల్లో సభ్యులు తిరిగిరావటంతో సంస్థ కార్యకలాపాలు మళ్ళీ జర్మనీలో కొనసాగాయి.

1936 నుండి ఈ నాటి వరకు ఈ సంస్థ చేస్తున్న అధ్యయనాల్ని విమర్శనా సిద్ధాంతం (critical theory) పేరుతో పిలవటం జరుగుతోంది. చాలా కాలం పాటు విమర్శనా సిద్ధాంతం సంస్థ సభ్యుల మార్క్సిజానికి మారుపేరుగా నిలిచింది. హెగెలియన్ - మార్క్సియన్ గతితర్కం ప్రాతిపదికగా విమర్శనా సిద్ధాంతం కొనసాగింది. చారిత్రక భౌతికవాదం, విప్లవ సిద్ధాంతం, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకి సంబంధించిన మార్క్స్ విశ్లేషణల్ని సంస్థ సభ్యులు ప్రేరణలుగా చేసుకున్నారు. సరుకులు, ద్రవ్యం, విలువ, మారకం, వస్తులభ్యతను గురించిన మార్క్స్ ఆలోచనలు కేవలం పెట్టుబడిదారీ వ్యవస్థల ఆర్థిక రంగానికేగాక, పెట్టుబడిదారీ వ్యవస్థల్లోని అన్ని సామాజిక సంబంధాలకి వర్తిస్తాయని భావించటం జరిగింది. ఈ వ్యవస్థలో మానవ సంబంధాలతో పాటు అన్ని జీవన రూపాల్ని సరుకులు మారకపు సంబంధాలు, విలువలు నియంత్రిస్తాయని అభిప్రాయ పడ్డారు.

హర్క్ హైమర్ 1937లో ప్రచురించిన ఒక వ్యాసంలో దారిద్ర్యానికి ప్రధానకారకం ఆర్థిక వ్యవస్థ కాబట్టి సైద్ధాంతిక, ఆచరణాత్మక విమర్శ అనేది దాని కేంద్రంగానే సాగాలని ప్రకటించాడు. సంస్థ సభ్యులు చాలామంది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థని ఉత్పత్తి వలయం, అరాచకత్వం, ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, యుద్ధాలు లాంటి అంశాలు అనివార్యంగా పతనం వైపు నెడతాయని భావించారు. అలాగే పెరుగుతూవున్న పెత్తందారీతనం, సామాజిక హేతుబద్ధీకరణక్రమం వ్యక్తిత్వపు లక్షణాల్ని, స్వయం ప్రతిపత్తిని, స్వేచ్ఛని ధ్వంసం చేస్తున్నాయని ప్రకటించారు.

సాంఘిక ప్రయోజనాలు, సంఘర్షణలు, వైరుధ్యాలు తాత్విక రూపంలో ఎలా వ్యక్తీకరణ పొందుతున్నాయో, అవి అణిచివేత రూపాలుగా, అధిపత్య రూపాలుగా ఎలా రూపొందుతున్నాయో విశ్లేసించే ప్రయత్నం చేసిన స్కూలు సభ్యులు చాలా వరకు విజయం సాధించారు. జర్మన్ తాత్విక సాంప్రదాయం పట్ల గౌరవం వున్న ఈ స్కూలు సభ్యులు అమలులో వున్న అనేక ఆలోచనా చట్రాల సంకుచిత పరిదుల్ని బద్దలు కొట్టే వుద్దేశ్యంతో తమ కృషి కొనసాగించారు. పోటీ పెట్టుబడిదారీ విధానం మోనోపలీ పెట్టుబడిదారీ విధానంగా, ఫాసిజంగా పరిణమిస్తున్న విధానాన్ని దగ్గరగా పరిశీలించిన స్కూలు సభ్యులు సమాజం సోషలిజం వైపు ప్రయోగించే క్రమాన్ని ఉద్దేసించిన సిద్ధాంత రూపకల్పన కోసం శ్రమించారు. వాళ్ళు ముందుకు తెచ్చిన విమర్శనా సిద్ధాంతం ఒకగొప్ప స్వేచ్ఛాయుత సమాజాన్ని లక్ష్యంగా కలిగి వుండాలని నమ్మారు.

1930లలో స్కూలు సభ్యులు ఎవరికి వాళ్ళుగా చేసిన పరిశీలనలు అమలులో వున్న సామాజిక వ్యవస్థల స్వరూప స్వభావాల్ని బహిర్గతం చేశారు. మోనోపలీ పెట్టుబడిదారీ విదానం, కొత్తగా తలెత్తిన

పారిశ్రామిక రాజ్యం, సాంకేతిక పరిజ్ఞానపు పాత్ర, మోనోపలీ పెట్టుబడిదారీ విధానపు ఫలితంగా రూపొందిన గొప్ప గొప్ప కార్పొరేషన్లు, సాంస్కృతిక పరిశ్రమ, వ్యక్తి అనే భావన అంతర్థానమయి 'మంద' అనే భావన ముందుకు రావటం మొదలైన అంశాల్ని గురించి లోతైన పరిశీలనలు చేశారు. ప్రతికూల వాతావరణంలో కూడా రాడికల్ విమర్శనా సిద్ధాంతాన్ని కొనసాగిస్తూ రావటం వల్ల ఈ స్కూలు సభ్యులు ఒకానొక నవ్య మార్క్సిజం రూపొందటానికి కారకులయ్యారు. మారిన సామాజిక వాస్తవికతలో దానికి తగిన విమర్శనా సిద్ధాంతాన్ని రూపొందించగలిగారు.

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతూ వున్న కాలంలో స్కూలు సభ్యుల మధ్య కొన్ని స్వల్ప విభేదాలు తలెత్తాయి. యుద్ధ వొత్తిడి కూడా వీళ్ళమీద అపారంగా వుంది. అదార్నో హర్క్‌హైమర్ కాలిఫోర్నియాకి చేరారు. లోవెన్‌థాల్, మార్క్యూజ్, లాంటివాళ్ళు అమెరికన్ గవర్నమెంట్ సంస్థల్లో చేరి ఫాసిజాన్ని అధ్యయనం చేయటంలో వాళ్ళకి సహకరించటం ప్రారంభించారు. 1940ల తరువాత స్కూలు సభ్యులు చేసిన పరిశీలనల్లో, అధ్యయనాల్లో కొన్ని మౌలిక మార్పులు కన్పిస్తాయి. అదార్నో, హర్క్‌హైమర్లు కలిసి ప్రచురించిన 'డయాలక్టిక్ ఆఫ్ ఎన్‌లైటెన్‌మెంట్' (1947)లో ఈ మార్పు స్పష్టంగా చూడవచ్చు. వికాస యుగాన్ని, వికాస యుగపు ఆలోచనకి కొనసాగింపుగా వచ్చిన మార్క్సిజాన్ని, ఫాసిజాన్ని, వినిమయం సంస్కృతిని తీవ్రంగా విమర్శకి గురిచేయటం ఈ రచనలో కన్పిస్తుంది. మార్క్సిజం ప్రవచించిన చారిత్రక సిద్ధాంతం నుండి బయటపడి అసలు తత్వశాస్త్రపు చారిత్రక పునాదుల్లోకి వెళ్ళి గ్రీకు శాస్త్రతత్వాన్ని, ఫాసిజాన్ని, కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులను, సాంస్కృతిక పరిశ్రమ అనేది రూపొందిన క్రమాన్ని విశ్లేషించి విమర్శించేదాకా పోవటం జరిగింది. పాశ్చాత్య ప్రపంచం ముందుకు తెచ్చిన హేతుబద్ధత మనిషిని విముక్తం చేయటానికి బదులు కొత్త అణిచివేత రూపాల్ని ముందుకు తెచ్చిందని, వికాస యుగం ఏ లక్ష్యాలతో మొదలయిందో ఆలక్ష్యాల్ని నెరవేర్చకపోగా అందుకు భిన్నమయిన అణిచివేతకి, మార్మికతకి కారణమయిందని. ఈ ఇద్దరు రచయితలు సోదాహరణంగా రుజువు చేశారు. వికాస యుగపు తాత్విక పరిణామంలో మార్క్సిజాన్ని కూడా భాగంగానే చూసారు.

యుద్ధం ముగిసిన తరవాత అదార్నో, హర్క్‌హైమర్, పొల్లాక్‌లు ఫ్రాంక్‌ఫర్ట్‌కి తిరిగివచ్చి స్కూల్ని మళ్ళీ పునరుద్ధరించారు. అయితే మార్క్యూజ్, లోవెన్‌థాల్ ఇంకా కొంతమంది మాత్రం అమెరికాలోనే వుండిపోయారు. క్రమంగా మళ్ళీ జర్మనీలో ఫ్రాంక్‌ఫర్ట్ స్కూలు పేరుమారుమోగటం మొదలైంది. క్రమంగా సంప్రదాయ మార్క్సిస్టులకి స్కూల్ సభ్యులకి మధ్య తీవ్రచర్చలు, వాదోపవాదాలు ప్రారంభమయ్యాయి. శాస్త్రీయ మార్క్సిజాన్ని, విప్లవాత్మక మార్క్సిజాన్ని నీరుగార్చుతున్నారనే విమర్శ వీళ్ళమీద మొదలైంది.

అదార్నో ప్రతిపాదనలు సంప్రదాయ మార్క్సిస్టులకి సవాలుగా నిలిచాయి. సమాజంలోని వ్యక్తులందరూ సాంకేతిక స్వామ్యపు వలలో చిక్కుకున్నారు. పెత్తం దారీ విదానం జీవితపు అన్ని పార్శ్వాలలో అమలవుతూ వుంది. కేంద్రీకృత పెట్టుబడి, పథకాలు, గుంపు సంస్కృతి మొదలైన

వాటి ఫలితంగా వ్యక్తి అనే భవన కేవలం గతానికి చెందిన అవశేషంగా మిగిలింది. వ్యక్తిగత స్వేచ్ఛ అంతర్ధానమయింది. విమర్శనాత్మక దృష్టి ధ్వంసం చేయబడింది అని ప్రకటించాడు అదార్నో. రెండవవైపు అమెరికాలో హెర్బర్ట్ మార్క్యూజ్ మార్క్స్‌ని, ఫ్రాయిడ్‌ని సమ్మేళనం చేసే ప్రయత్నం చేస్తున్నాడు. అలాగే అమలులో వున్న సామాజిక వ్యవస్థల్ని విశ్లేషిస్తూ మార్క్యూజ్ రాసిన వన్ డైమన్షనల్ మాన్ గొప్ప సంచలనాన్ని సృష్టించింది. సమకాలీన సామాజిక వ్యవస్థలు వాటి అస్తిత్వం కోసం వ్యక్తిలోని హేతువుని చంపి ఏక కోణంలోంచి మాత్రమే ఆలోచించే మనిషిని రూపొందించుకున్నాయని, వ్యవస్థల్లో విమర్శనా సూత్రం అంతరార్ధనమయిందని ఈ స్థితిలో మార్క్స్ వుద్దేశించినట్లుగా కార్మికవర్గం విప్లవం చేయటం అసాధ్యమని ప్రకటించాడు. కమ్యూనిస్టు పార్టీలు నిర్వర్తిస్తున్న పాత్ర మీదకూడ మార్క్యూజ్ తీవ్రవిమర్శ పెట్టాడు.

ఇరవయ్యో శతాబ్దంలో అనేకమంది గొప్ప తాత్వికుల్ని ముందుకు తెచ్చిన ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ చారిత్రాత్మక పాత్రనే నిర్వర్తించింది. అనేకమంది సభ్యులువున్న ఈ సంస్థలో చాలా విషయాల్లో సూత్రబద్ధంగా ఏకాభిప్రాయమున్న స్వతంత్ర ఆలోచనవున్న వాళ్ళు ఎక్కువగా వుండటం వల్ల 1950ల తరవాత సంస్థ సభ్యుల మధ్య కూడా తీవ్ర వాదోపవాదాలు నడిచాయి. క్రమంగా సంస్థ బలహీనపడింది. అయితే ఇవ్వాళ ప్రపంచవ్యాప్తంగా వికాసయుగం మీద, ఆధునికతవాదం మీద వస్తున్న విమర్శల్ని ఏదోవాక రూపంలో ఎదుర్కొంటూ, ఆధునికత పథ్యకం ఇంకా పూర్తికాలేదని వాదిస్తున్న ప్రముఖ తాత్వికుడు జ్యార్జన్ హెబర్మాస్ ఫ్రాంక్ ఫర్ట్ స్కూల్ సంప్రదాయంలోంచి వచ్చిన వారే.

*Continued 162*

with Sialkoti onion and Kohistani namak. One particular joke about Sialkot onions was still in circulation when I visited my school town in 1980.

The joke is that a peasant was caught stealing onions from a field by its owner. When asked what he was doing, the Sialkti peasant replied: "I was blown here by the wind."

"And who plucked those onions"?

"I caught hold of them to stop myself from being blown away".

"And how did you get into the sack".

"That is exactly what I was wondering when you interrupted me".

The man got away but I had heard the same joke being attributed to Mulla Nasruddin Hooja whom 17 countries claim to be their own.

I will not mention the jokes about the bathrooms of Jallundur because they are not worth mentioning. In business, Punjabis have sold refrigerators at the North Pole, coal at New Castle and cloves at Zanzibar.

It is time someone should compile these jokes city-wise, sex-wise and otherwise and bring out a much-needed Directory of Punjabi Jokes.

# ప్రపంచం ఇంతగామారినా ఆడవాళ్ళకు అంతా అందంలోనే ఉందా?

**- మిసిమి వర్క్‌షాప్**

నేడు స్త్రీలు అన్నిరంగాలలోకి ప్రవేశిస్తున్నారు. శక్తిమంతులుగా తయారవుతున్నారు. పురుషునితో దీటుగా ఏపని అయినా చేయగలుగుతున్నారు. అలాంటి ఈరోజుల్లో స్త్రీలలో చాలమంది ఎందుకు ఇంకా అందాన్ని ఆదర్శంగా పెట్టుకోవాలని అనుకొంటున్నారు. అందంచాటున దాక్కొంటున్నారు.

అసలు మన సమాజంలో ప్రతి ఒక్కరు తమదైన ప్రతిమ (**image**) ను పెంపొందించుకోవాలని చూస్తారు. అటువంటి సమాజంలో చాలమంది స్త్రీలు తమ అందాన్ని ఆదర్శ ప్రతిమగా తీసుకొని, దాని కనుగుణంగా తమను మలుచుకొంటున్నారు. ఇదొక విరోధాభాస ఎందుకంటే, ఈ యుగంలో, పూర్వం ఎప్పుడు లేనన్ని అవకాశాలు, స్త్రీలు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవడానికి ఉన్నాయి. మరి అలాంటప్పుడు అందాన్ని అంతగా ఆరాధించవలసిన పని ఏముంది?

హెరాల్డ్ బ్లూమ్‌ఫీల్డ్ అనే అమెరికన్ మనోరోగ నిపుణుడు ఇలా అంటున్నాడు: మగవాళ్ళ చేతుల్లోనే అంతా ఉంది - అధికారం, ప్రభావం, ఒనరులు మరి అలాంటప్పుడు ఆడవాళ్ళు ఎంచేస్తారు? ఒనరులను నియంత్రించడానికి వారికున్న ఒకే ఒక మార్గం అందంగా ఉండడం.

దీనికి సంబంధించి అతడు క్లింటన్ స్కాండల్‌లో ఇరుక్కొన్న మోనికా లెవిన్‌స్కీ, లిండాట్రిప్‌లను ప్రసారమాధ్యమం అవమానానికి గురిచేయడాన్ని ఉటంకిస్తున్నాడు. సమాజనీతిని అతిచరించిన ఆడవారిశైలిని ( కనిపించే తీరును) ఎగతాళి చేయడమే సమాజానికి వారిని శిక్షించడానికి ఉన్న మార్గం. ఈ విమర్శకు ఆ ఇద్దరు ఆడవాళ్ళు ప్రతిస్పందించిన తీరుచూద్దాం. గడ్డానికి, ముక్కుకు, మెడకు, ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొంది. నలభై పౌనుల బరువు తగ్గించుకొంది, ఇంకొక ఇరవై పౌండ్లు తగ్గించుకోవడానికి వాగ్దానం చేస్తూ రాబోయే కోర్టు విచారణలో కోర్టులో బాగా కనిపించాలను కొంటున్నానని చెప్పింది. తన ఫొటోను వెబ్‌సైట్‌లో ఉంచింది. ''బరువు తగ్గించుకోవడం ఎలా'' అనే కార్యక్రమానికి ప్రవక్త లెవిన్‌స్కీ ఈ విషయాన్ని ఆమె తాను బరువు తగ్గుతూ రుజువు చేసింది. ఒకవిధంగా ఇలా తమ శరీరాలు కనిపించే రీతిని మార్చుకోవడం తాము చేసిన వెధవ పనులకు బహిరంగంగా పశ్చాత్తాపం వెలిబుచ్చడమే.

''సన్నబడాలి, సన్నగా ఉంటే అందంగా ఉంటాం'' అనే ధోరణి ఇటీవలి కాలంలో బాగా పెరిగి పోయింది. విక్టోరియా నీతి అంటే ఆదర్శవంతమైన భార్య, తల్లి పాత్రలను పోషిస్తూ- ఎదురుతిరిగి స్థిరీకృతమైన లావుగా ఎర్రగా బుర్రగా ఆకర్షణీయంగా ఉండే స్త్రీ ప్రతిమకు స్త్రీలు ఎదురుతిరిగారు.

సౌందర్య పరంగా ఆధునిక దుస్తులు, వాస్తుశిల్పం, వినిమయ వస్తువులు ఎక్కువగా నునుపైన సరళ సమరూప ప్రతిమను ఆదర్శవంతం చేస్తున్నాయి. తినడానికి చాలమందికి తిండిలేని రోజుల్లో

అయితే, లావు గుండ్రని (Plump) ఆకృతి అందంగా కనిపించి సంపదకు ప్రతీకగా ఉండేది. ఇప్పుడు ఆహారం ఎక్కువ మందికి అందుబాటులోకి రావడంతో, పలుచగా (Thinness) కనిపించడం అంతస్తుకు ప్రతీక అయింది.

గమ్మత్తు ఏమిటంటే, స్త్రీలు తమ జీవితాల మీద తమకు అధికారం ఉన్న ఈ రోజుల్లో, వారు ఇంకా ఇంకా, అసహజమైన, అవాస్తమైన ''ఆకర్షణ ప్రమాణాల''కు గురవుతున్నారు. ఫ్రేజర్ అంటాడు గదా: ''అది ఒక రకం స్త్రీలను వారి స్థానాల్లో వారిని ఉంచడమే ఒక తెలివైన, శక్తిమంతమైన స్త్రీ ''కనిపించేరీతి''ని (looks) ఎగతాళిచేస్తే, ఆమెసాధించిన దానినంతా, ఆమె విజయాన్నంతా తీసివేసినట్లే అవుతుంది.

''మనం నూతన సహస్రాబ్దిలో అడుగిడుతున్నాం. మరి పరిస్థితులు మారవలసి ఉన్నాయి. 'అందంగా ఉండడం అంటే ఏమిటి?' అనే ప్రశ్నను తిరిగి ఆలోచించాలి'' అంటాడు బ్లూమ్ ఫీల్డ్

ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి. మీ ప్రతిమ (image)ను గురించి మీరు ఏమనుకొంటారో తెలుసుకోండి.

**1. లావుతగ్గాలని తిండి తగ్గించావా, ఎప్పుడైనా?**

ఎ) అవును బరువు తగ్గించుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను.
బి) లేదు
సి) అప్పుడప్పుడు ప్రత్యేకమైన దుస్తులు ధరించడం కోసం.

**2. నీవెలా కనిపిస్తున్నావని నీవనుకొంటున్నావు?**

ఎ) అసంతోషంగా, అసంతృప్తిగా
బి) రీజనబుల్‌గా సుఖకరంగా ఉన్నాను
సి) చాల బాగున్నాను, ఏ ఆదర్శరూపానికి సరిపోయేట్టు నన్ను నేను మలుచుకోవాలని చూడను.

**3. ఎప్పుడైనా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొన్నావా?**

ఎ) లేదు అది సరైన భావనకాదు
బి) లేదు, నేను దేనికోసమో కూడ బెడుతున్నాను
సి) అవును, అనేకసార్లు చేయించుకొన్నాను.

**4. నీ అందాన్ని చూసి నీ భాగస్వామి ఏమనుకొంటున్నాడు?**

ఎ) నేను ఉన్న దానిని ఉన్నట్లుగానే ఆయన సంతోషిస్తున్నాడు.
బి) అతడెప్పుడూ నా బట్టలు, జుత్తు, బరువుల గురించి వ్యాఖ్యానిస్తూనే ఉంటాడు.
సి) అతడేమనుకొన్నా నాకు లెక్కలేదు.

**5. నీవు పనిచేసే చోట నీవు మగవారితో సమమనే భావిస్తావా?**

ఎ) అవును, నేను నా పని బాగా చేస్తాను

బి) లేదు నన్ను తక్కువగా చూస్తారని, అభద్రత అనుభవిస్తూ ఉంటాను.

సి) అవును, నేను ఎప్పుడు ''బాగా కనిపించి'' నన్ను నేను రుజువు చేసుకోవాలనుకొంటాను.

**6. ప్రజా జీవితంలో పాల్గొని ఎప్పుడూ ఉపవాసాలు చేసే (dieting) ఆడవాళ్ళగురించి నీవేమనుకొంటావు?**

ఎ) వారు చాల అపాయకరమైన ''ఆదర్శ నమూనాలను'' యువతులకు అందిస్తున్నారు.

బి) వారు తమకు చేతనైనంతలో బాగా కనిపించాలని ప్రయత్నించడం మంచిదే.

సి) వారు ప్రసార మాధ్యమంతో, పురుషులతో ప్రభావితం చేయబడుతున్నారు.

**7. స్థిరీకృత ఆదర్శ స్త్రీ మూర్తిని సవాలు చేయాలని నీవు అనుకొంటున్నావు.**

ఎ) తప్పకుండా అది స్త్రీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

బి) లేదు మగవారికి ఎలాగుంటే ఇష్టమో ఆడవాళ్ళు అలా ఉండాలి.

సి) అవును అలా ఉంటే ఆడ మగ ఇద్దరికి సుఖం

**8. ఈ భావనలను స్త్రీలు ఎలా మారుస్తారు?**

ఎ) తమంత తాముగా ఉండి, తమ కూతుళ్ళకు విశ్వాసం కలిగించడం ద్వారా

బి) సమస్యలను ఎదుర్కోవడం ద్వారా

సి) అది అర్థరహితం

**9. ఎప్పుడైనా నీవు పూర్తిగా మార్పించుకొన్నావా?**

ఎ) అవును 'నేను మరొకరిని' అని నేను అనుకొనేట్లు చేసింది

బి) నేను ఎప్పుడు మారిపోదలుచుకోలేదు.

సి) లేదు, కాని నేను మారిపోవాలనుకొంటున్నాను.

**10. ఏ రకం స్త్రీని నీవు ఎక్కువగా ఆరాధిస్తావు?**

ఎ) అందంగా కనిపించే పలుచని స్త్రీని

బి) ప్రపంచాన్ని బాగుచేయడానికి దానికి తన తెలివితేటలుపయోగించే స్త్రీలను

సి) ఆకర్షణీయంగా ఉండి విజయాలను సాధించిన స్త్రీలను

మీ స్కోరు లెక్కించుకోండి

| | ఎ | బి | సి |
|---|---|---|---|
| 1 | 0 | 10 | 5 |
| 2 | 0 | 5 | 10 |
| 3 | 10 | 5 | 0 |
| 4 | 10 | 0 | 5 |
| 5 | 10 | 0 | 5 |
| 6 | 10 | 0 | 5 |
| 7 | 10 | 0 | 5 |
| 8 | 10 | 5 | 0 |
| 9 | 5 | 10 | 0 |
| 10 | 0 | 10 | 5 |

66-100 మార్కులు వస్తే నీవు ఆత్మ విశ్వాసం గల స్త్రీవి. నీ ''కనిపించేతీరు'' మీద నీకు వాస్తవ దృష్టి ఉంది. మగవారిని సంతోషింపజేయడానికి గాని, వారి సంకుచిత సౌందర్య నిర్వచనానికి అనుగుణంగా ఉండాలని గాని నీవు అనుకోవు. నీ శక్తి సామర్థ్యాల మీద నీకు గర్వం. మగవానితో నీవు దీటైన దానివని అనుకొంటావు. నీవు ఇతరులకు ఉదాహరణగా ఉండడం ద్వారా, ఈ పురుషాధిక్య ప్రపంచంలో అంతగా ఆత్మవిశ్వాసం లేని స్త్రీలకు ఆదర్శంగా ఉండవచ్చు.

35-65 చాలమంది ఆడవాళ్ళలాగే, నిరంతరం ప్రసార మాధ్యమం ప్రసారం చేసే 'అందం ప్రతిమ' కు అనుగుణంగా ఉండాలనే ఒత్తిడిని నీవు అనుభవిస్తూ ఉంటావు. కాని మొత్తం మీద నీవు ఉన్న తీరుతోనే సంతృప్తి పడతావు. ఆడవాళ్ళను ఎప్పుడూ ఇతరులు కావలసిన తీరులో మలుస్తూ ఉంటారని నీవు అనుకొంటావుగాని, దానికి ఎదురు తిరగాలని నీవు అనుకోవు. బహుశ నీవు అందంగా కనిపించాల్సిన అవసరానికి, నీ ఆత్మ ప్రతిష్టను ఇనుమడింపజేసుకోవడానికి మధ్య సమతూకాన్ని, అర్థవంతమైన ఉత్తేజకరమైన పనిద్వారా, సాధిస్తావు.

0-34 దురదృష్టం. మగవాడు దేనిని ఆదర్శవంతమైన అందం అంటాడో నీవు దానిని అంగికరిస్తున్నావు. దానిని పొందడం చాల మంది ఆడవాళ్ళకు సాధ్యం కాదు. అందుకని నీవు చాల అసంతోషానికి గురవుతావు. ఆత్మ గౌరవం పోతుంది. అందుకని నీవు ఎక్కడ బాగా రాణించగలవో ఆ పనులను చేయి. బహుశ నీవు ఇతర స్త్రీలతో మాటాడి నీ వేదనలను తెలియజెయ్యి. అలా చేస్తే, ఖచ్చితంగా ''అందమే అంతాకాదు'' అని గుర్తిస్తావు.

# విలువలు లేని ప్రమాణాలు వ్యర్థం

## (1947 నోబెల్ సాహిత్య బహుమతి పురస్కార స్వీకారోపన్యాసం)

మూలం : ఆంద్రీ జీద్ అనువాదం : **కె. కృష్ణమూర్తి**

ఫ్రెంచ్ రాయబారి గబ్రియల్ ప్యూఒ (Gabriel Puaux) చదివినది: ''చాలా సంతోషకరమైన అంతకు మించి ఎంతో విజ్ఞానదాయకమైన ఇట్లాంటి ప్రత్యేక కార్యక్రమానికి రాలేక ఎంతో బలవంతంగ నా ఈ ప్రయాణం మానుకుంటున్నాను. ప్రత్యక్షంగా మీ ముందు నిలబడి నా కృతజ్ఞతలు తెలుపలేక పోతున్నందుకు బాధపడుతున్నాను. నా బాధను చెప్పటానికి ప్రత్యేక ప్రయోజనం లేదు. అంతకు మించిన కారణం కూడ ఏది లేదు.

మీ అందరికి తెలుసు సత్కారాలకు పురస్కారాలకు నేను చాలా దూరమని. అట్లాంటి వాటిని ఎపుడు తిరస్కరిస్తుంటానని. ఒక ఫ్రాన్స్ దేశస్థుడిగా నాదేశం ఇచ్చే పురస్కారాలనే సగౌరవంగా స్వీకరిస్తాను. ఊహించకుండానే మీ నుండి ఇంత గొప్ప నోబెల్ పురస్కారం పొందటం నిజంగ నేను నమ్మలేక పోయాను. ప్రతి రచయిత ఇట్లాంటి పురస్కారాన్ని ఎప్పుడూ కోరుకుంటాడు. చాలా సంవత్సరాల నుండి నేను ఎడారిలో రోదిస్తున్నానని అనుకునే వాన్ని. ఆ తరువాత కొంతకాలం నాతో మాట్లాడటానికి, నా అంతర్మథనం గుర్తించటానికి కొంతమందైనా ఉండక పోరా అని అనుకునేవాన్ని. అదేమీరు నిజం చేసి చూపారు. నా నమ్మకానికి నా విశ్వాసానికి ప్రాణం పోసారు. నిదానంగానైనా. నే నమ్మిన సిద్ధాంతాన్ని గుర్తించి వ్యాప్తిలోకి తెచ్చారు.

మీరు నా రచనను గుర్తించి నన్ను ఈ పురస్కారానికి ఎన్నుకున్నారని నేను అనుకోను. అందులో ఉన్నటువంటి - ఉత్తేజపూరితమైన స్వతంత్రమైన ఒకానొక పరమార్థం చూస్తుంటారు. మన రోజుల్లో అన్ని వైపుల నుండి గడ్డు కాలాన్ని చవిచూసిన పరమార్థం అది. అదే మీరు నాలో గుర్తించారు. దాన్నే మీరు సమ్మతించి ప్రోత్సహించవలసిన అవసరం ఉందని అనుకున్నారు. ఆ విషయమే నా ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తిగతమైన సంతృప్తిని పెంపొందిస్తుంది. అది ఏది ఎంతైనా నేను అట్లానే ఆలోచిస్తూ పోను. ఎందుకంటే నా కన్నా గొప్పగా ఈ విషయాన్నే తెలియజేసిన వ్యక్తి ఫ్రాన్స్ దేశంలో మరో అతనున్నాడు. అతడే పోల్ వలెరి (Paul Valery). మా ఇరువురి 50 సంవత్సరాల స్నేహంలో ఆయన్ను నేను ఎంతగానో గౌరవించాను. మరెంతగానో ప్రభావితుడనైనాను. ఆయనకు బదులుగా నన్ను ఎన్నుకున్నారేమో అనుకుంటాను ఎందుకంటే అతనిని ఎన్నుకోవటంలో అతని మరణమే మీకు అడ్డువచ్చి ఉంటుంది. నేను చాలాసార్లు తెలియజేసాను. ఆయన మేధస్సు ముందు, ప్రతిభ ముందు నేను ఎప్పుడు తలదించుకునేవాన్ని. ఆయన జ్ఞాపకాలు ఈ సమావేశంలో అందరిలో ఉంటాయని అనుకుంటాను. ఆయన జ్ఞాపకాలు చీకట్ల పొరలను చీల్చి వెలుగును చిమ్ముతాయని ఆశిస్తాను. ఒక నూతన స్వతంత్రమైన ఆలోచనను గుర్తించి దానిని ఆహ్వానించి ఈ పురస్కారం చేత దానికి విజయం చేకూర్చారు. సరిహద్దుల హద్దులు దాటి, చిన్నా పెద్ద భేదాలు వదిలి, రాగద్వేషాలు మరచి మీరు ఇవ్వటానికి పూనుకున్న ఈ పురస్కారం ఊహించనటువంటి అసాధారణ ప్రతిభకు వెలుగు''.

నోబెల్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు (Andre Tiselius Gide) ఆంద్రీ తిసల్యుస్ జీద్ సమ్మతికి ఈ క్రింది మాటలు చెప్పారు. ''దురదృష్టవశాత్తు - అనారోగ్యం కారణం వల్ల Mr. Andre Gide కు రావాలన్న కోరిక ఉండి కూడ. తన ప్రయాణం వదులుకున్నాడు. దానికి బాధపడుతూ మేము ఆయనకు పూజ్యభావంతో పాటు మా సానుభూతిని తెలియజేస్తున్నాము. ఫ్రెంచి సాహిత్య క్షేత్రంలో అత్యంత గౌరవనీయుడు. తన మేధా సంపత్తితో ప్రగాఢమైన ప్రభావం మనపై వేసినవాడు Mr. Andre Gide.

స్వీడిష్ అకాడమి శాశ్వత కార్యదర్శి ఆండెర్స్ ఓస్టర్‌లింగ్ (Anders Osterling) చే సమర్పించబడిన ప్రసంగం: ఇరవై సంవత్సరాల వయసు నుండి రచయితగా ఒక ప్రముఖ పత్రికకు అర్థశతాబ్దిపాటు మొదటి పేజీని నిర్వహించాడు ఆంద్రీ జీద్. ఇతను నాటి ప్రతీక వాదుల రచయితలలో ప్రముఖుడు. లాటిన్ నగరంలో ఒక భవంతి ఆరవ అంతస్థులో నిలబడి ప్రతీక వాదుల సమావేశం ఎక్కడ ఏర్పాటు చేయాలని చూస్తున్నాడు. సేన్‌నది ఆండ్ నోత్రు ఛార్ట్ దామ్ (Seine and Notre Dame) లను కిటికీ గుండా చూస్తూ నిలుచున్నాడు. అది ఆకురాలు కాలం సూర్యాస్తమయం కిటికీ లోంచి చూస్తూ బల్‌సాక్ (BALZAC) నవలలోని కథా నాయకుడిగా తను అనుభూతిని పొందుతున్నాడు. ర్స్టింగ్‌న్యాక్ (Rastingnac) బల్‌సాక్ (Balzac) నవలలో సాధారణంగా కనిపించే కథానాయకుడి పేరు) ఎలాగైతే విజయదాహంతో తన కాళ్ళ దగ్గరున్న పట్టణాలను జయించటానికి సిద్ధంగా ఉండి ''ఇపుడు మనమిద్దరమే,'' ఇక నువ్వో నేనో అని అన్నట్లుగా ఆంద్రీ జీద్ కూడ సమావేశం నిర్వహించటానికి సాధ్యంకాని విధంగా పరిస్థితులున్నా నిర్వహించాలన్న కోరికతో ఆలోచిస్తున్నాడు. కాని ఇది సులభమైన విజయం కాదని ఆంద్రీ జీద్‌కు తెలుసు.

సదా వివాదాస్పదంగా కనిపించే 78 ఏళ్ళ ఈ రచయిత ఈనాడు నోబెల్ పురస్కారం చేత గౌరవింపబడినాడు. మొదటి నుండే ఆధ్యాత్మిక ఆలోచనా పరమైన బీజాలు తనలో ఉండేవి అవే తనను ప్రగతిపథంలో ముందుకు నడిపాయి. ఈ ఒక్క విషయమే తనను ప్రముఖ ఫ్రెంచి సాహిత్య మూర్తుల మధ్య ఒకడిగా చెప్పటానికి కాని, తరాల తరబడి ఇంకా తన ప్రభావం కొనసాగడానికి కాని కారణం మాత్రం కాదు. ఆంద్రీ జీద్ 1890లో మొదటి రచన కావించాడు. 1947 వసంత కాలంలో అతని చివరి రచన వెలువడింది. యూరప్ చరిత్రలో ఆధ్యాత్మికతకు అది అతి ప్రధానమైన కాలం. అలాంటి ఆధ్యాత్మిక పరమైన ప్రధానాంశాలు ఇతని రచనలలో ఉండటం చేత నాటకీయంగానే ఒక రకమైన దీర్ఘకాల జీవితానికి పునాదులు పడినాయి. ఆయన రచనల వాస్తవ విలువలను ఇప్పుడెందుకు ప్రశంసించ వలసి వచ్చిందని మీరేవరైన అడగవచ్చు. దానికి కారణం ఉంది. ఈయన ఎటువంటి సంశయం లేనటువంటి ఎవరం ప్రశ్నించలేనటువంటి మహా రచయితల వర్గానికి చెందినవాడు. ఇట్లాంటివారి వాస్తవ విలువలను నిర్ణయించటానికి కావలసింది స్థూల దృష్టి, అంతకు మించి సరిపడు అవగాహనా సామర్థ్యం, భాష వ్యవహార క్రమస్థాయి ఏంటో అన్న పరిజ్ఞానం అవసరం. అతని సమకాలికులందరిలో ఆంద్రీ జీద్ ఎంతో వైవిధ్యం ఉన్న వ్యక్తి. శాశ్వతమైనటువంటి విలువలకు, సత్యాలకు అనుకూలంగా ఉద్దేశాలు రూపొందించుకోవటం. ఆ విధంగానే మార్చుకోవటం. భిన్న

కోణాల నుంచి విషయాన్వేషణ కోసం అవిశ్రాంతంగా పని చేయటం ఈయన పద్ధతి. అందు వల్లనే ఈయన రచనలలో అంతరాయం లేని సంభాషణ ఉంటుంది. నిరంతరం అవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడే విశ్వాసం ఉంటుంది. ప్రేమైక జీవితానికి అడ్డుతగిలే కఠోర నియమాల ధిక్కారణ ఉంటుంది. స్వేచ్ఛను హరించే నిబంధనలకు వ్యతిరేకత ఉంటుంది.

ఈయనకు సామాజిక జీవితం పట్ల ఆసక్తి ఎక్కువ. మార్పులకు అనుగుణంగా జీవించాలన్నది ఇతని అభిమతం. ఇతను 1927లో కాంగో దేశానికి, 1935లో సోవియట్ రష్యాకు చేసిన ప్రసిద్ధ నౌకాయానమే అందుకు తార్కాణం. సాహిత్య క్షేత్రంలోనే ఉంటూ, సాహిత్య మూర్తుల మధ్య అగ్రగణ్యుడుగా ఉండాలన్నా ఉద్దేశం కాని, అట్లాంటి కోరికలేవి లేవని చెప్పటానికి తను చేసిన యాత్రలే చక్కని ఉదాహరణలు. ఆంద్రీ జీద్ ప్రొటెస్టెంట్ (protestant) కుటుంబం నుండి వచ్చినవాడు. సామాజిక స్థితిగతులు తెలిసిన నాగరిక కుటుంబం కావటం వల్ల తన వ్యక్తిగత జీవితానికి ఎట్లాంటి నియమాలు, నిబంధనలు ఉండేవి కావు. అందువల్ల తన వ్యక్తిత్వాన్ని తానే రూపొందించుకోవటానికి అవకాశం కలిగింది. 1924లో వెలువడిన సీల్ గ్రేన్ మెర్ "Sile grain ne meurt" (If it Die...) అన్న తన జీవిత చరిత్రలో కుటుంబం గురించి, చుట్టూ ఉన్న పరిసరాల గురించి వివరించాడు. "If it Die......" ''ఒకవేళ ఇది మరణిస్తే....'' అన్న భావము సేయింట్ చెప్పిన ''గోధుమ గింజ పరిపక్వతకు రాకుండానే రాలిపోతుందని'' చెప్పిన మాటల్లోనివి. అంతేకాకుండ ప్యూరిటన్ (Puritan) ( మత పరమైన ఆలోచనలో నిష్ణాతులు) విద్యావిధానానికి స్పందించి దానిని గట్టిగా వ్యతిరేకించాడు. ఏ మాత్రం అధైర్యపడకుండా తన జీవితకాలమంతా అటు మతంలో. ఇటు నైతిక ప్రమాణాలలో ఉన్నటువంటి ప్రాథమిక సమస్యలకు ప్రతిస్పందిస్తూ పోయాడు. 1909లో వచ్చిన ల పోర్త్ ఎత్రువత్ (La prote etroite) నిటారు ద్వారం (Strait is the Gate) అన్న చిన్న నవలలో పవిత్ర విలువలతో కూడిన క్రిస్టియన్ ప్రేమ సందేశం ఎట్లా దిగజారిపోతుందో విశదీకరించాడు. ఈనవలే"RACIN" విషాదాంత నాటకాలతో పోల్చదగ్గ అర్హత పొందింది.

అదే కాకుండ ఎవరైనా సరే ఇప్పటికి బలమైన బుజువులతో ఉన్న తన అవినీతి మతం అనే భావాన్ని అనుభవంతో తెలుసుకోవచ్చు. తను ప్రతిపాదించిన ఈ మతంను ఆయన ప్రత్యర్థులు అనేక విధాలుగా అనేక మార్లు వ్యక్తీకరించారు. ఇది వాస్తవానికి నిర్దేశించింది స్వేచ్ఛాయుతమైన ఆదర్శం, కారణం లేకుండా చెప్పే ఆదర్శం, నైతిక జ్ఞానాన్ని అన్ని అవరోధాల నుండి విముక్తి చేసిన ఆదర్శం. ఇది అమెరికన్ తొరో (Thoreau) వ్యక్తం చేసిన ''ఒకని ఆత్మకు ఎప్పుడు ఒక పనికి మాలిన విషయంతో సంబంధం ఉండి సదా దానికే బానిసగానే ఉంటుందని'' అన్న మాటలకు సాదృశ్యంగానే ఈ ఆదర్శం ఉంటుంది. ఎవరైనా తప్పకుండా గుర్తుంచుకోవలసింది ఎన్నో విషయాలతో కలిపి మంచి సూత్రాలను, గుణాలను చెప్పటానికి Gide పడిన శ్రమను. సర్వసాధరణంగా విలువలుగా గుర్తింపు ఉన్నటువంటి వాటిని ఏం తీసుకోకుండానే నూతన విలువలను ఎన్నో ఆవిష్కరించాడు. యుక్త వయస్సులో 1897లో లె న్యురిత్యుర్ తెరస్త్ర Les Novrritures terrestres, (Fruits of the Earth) పృథ్వీ ఫలాలు అన్న రచనను మొదట వ్రాయటం ప్రారంభించి తరువాత మానుకున్నాడు. ''మరిక, నా పుస్తకం

విసిరేయండి, నన్నిక వదిలిపెట్టండి'' అని తన శిష్యులకు, పాఠకులకు ఆయన విన్నవించుకున్నాడు. ఆ తరువాత వచ్చిన తన రచనలలో కూడ ఇదే ఉద్దేశాన్ని తెలియజేశాడు. కాని ఆ గొప్ప ప్రభావం ఎట్లా తొలగిపోతోంది. గాఢతతో నిండిన పదకృతులు - వేణుగానం లాంటి గద్య కృతుల నుండి ఇతనిని వేరు చేసి చూడడం సాధ్యమైన విషయం కాదు. విషయం పట్ల సమగ్ర ఆచార్యత్వము, ఆదర్శప్రాయము, అదునాతన పద్ధతులు జీద్ రచనలలో ఉంటాయి. బ్రుస (Brusa) ప్రాంతంలో ఉన్న ఒక మసీదు దగ్గర కూర్చుని మే నెల ఉదయం రాసింది ఎవరైనా చూసినట్లే, పత్రికలు రాయబడినట్లే ''హో! మొత్తం నూతనంగా ప్రారంభం అయ్యింది. సంతోషంతో ప్రతి అణువు పులకించిన అనుభూతి, పాలలాంటి చిక్కని ఉద్వేగం నిండిన అనుభవం ప్రతి అణువు గుండా ప్రవహిస్తుంది. దట్టమైన తోటలు పొదలను, గుర్తించండి గులాబి పవిత్రతను, చెట్టునీడలో కూడ తరగని దాని ఠీవిని గుర్తించండి. ఇదేనా నీవు అర్థం చేసుకున్న నవ యవ్వనం? దీనికి పూర్వస్థితి ఏమిటి? ఇదే జ్ఞాపకమా నాకు ఆధారమైనది? నేనొక మసీదు మూలన కూర్చున్నది నిజమా? నేను శ్వాసించేది నిజమా? కలనా నిన్ను ప్రేమించటం? నేను నేనేనా? ఒక వేళ నేను నేను కాకుంటే ఈ పక్షి నా దగ్గరకు ఎట్లా వస్తుంది?

ప్రతి కొత్త విషయం వెనుక ఒక మార్పు జీద్ దృక్పథం. ఇది ఆయన రచనల ద్వార తెలుస్తుంది. నవలలో వ్యాసాలలో, యాత్రా కథలలో, సమకాలీన విషయ విశ్లేషణలో జీద్ విద్వత్తు అంతటా మనకు కనిపిస్తుంది. తరగని అదే మనస్తత్వంతో ఒక భాషలో వ్యక్తీకరించిన ప్రశాంతమైన ఆలోచనా సరళి కనిపిస్తుంది. స్వచ్ఛమైనటువంటి, సున్నితమైనటువంటి అనేక భావాలు అనేక విధాలుగా ఆయన రచనలలో ఉంటాయి. - ఈ విషయం తెలుపటానికి 1920లో వచ్చిన లె ఫా మొన్ ఏర్ (Les Faux Monnayeurs) (The Counter Feiters) ఒక మంచి ఉదాహరణ. ఇది ఎంతో సాహసంతో లోతైన ఆలోచనతో విశ్లేషించి రాసింది. ఇందులో ఫ్రెంచి యువతకు సంబంధించిన అంశాలే ప్రధానం. ఎంతో నైపుణ్యాన్ని జతచేసి నూతన పంథాలో సాగిన ఈ నవల ఎందరినో ప్రభవితం చేసింది. సమకాలీన నవలా రచయిత లెందరికో ఇది ఆదర్శమైంది. ఆ తరువాత గతంలో తాను తెలియ చేసిన అంశాలను క్రోడీకరించి జ్ఞాపకాల సంపుటి అన్న పేరుతో ఒక సంపుటిని ప్రవేశపెట్టాడు. ఇందులో తను నిస్వార్థంగా ఏ కొత్త అంశాలను జత చేయకుండా ఉన్నది ఉన్నట్లుగా ఏది దాచుకోకుండా తన మంచితోపాటు చెడును కూడ నిర్భయంగా వెల్లడించాడు. తనమీద సహచారులు చేసే ప్రశంసలను సున్నితంగా తిరస్కరించినాడు. అత్యున్నతమైన నీతిని విశాల దృక్పథాన్ని భగవంతుడి సాక్షాత్కారంలోనే దర్శించాడు. తనను తాను భగవంతుడికి అర్పించుకున్నాడు. ఎంతో విలువైన తన జ్ఞాపకాల ఆత్మకథలు హేతుశక్తికి అంతుచిక్కని బైబిల్ సూక్తులలో మనకు దర్శనమిస్తుంది. గోధుమ గింజను జీవితానికి అన్వయించి చెప్పటం ఆంద్రీ జీద్ మార్మిక దృష్టికి ప్రతీక. ''పూర్తిగా ఎండి రాలి పడిన గోధుమ గింజనే పొందటానికి అర్హత పొందుతుంది'' అంటాడు. ఈ మాటల్లో జీద్ తాత్విక దృష్టి అర్థమౌతుంది. ఇంకా ఆయన ఇలా అంటాడు. ''నైతిక ప్రమాణాలను కాని, మత సంబంధమైన విషయాలను కాని అందులోని సందేహాలను కాని పరిశీలించి చూడటనాకి ఒక నిర్దిష్టమైన పద్ధతి ఉంటుందని నేను అనుకోను. అట్లాంటి వాటికి అనుకూలంగా ఉండటం కూడా నాకు తెలియదు.

నా జీవితంలో అన్ని సందర్భాలలో వాటిని సొంతంగా రూపొందించుకున్నాను. వాస్తవానికి నేను కోరుకున్నది కూడ వాటితో రాజీ పడాలని, చాలా వైవిధ్యంతో కూడిన స్పష్టమైన భావాలు ఏ ఒక్కటి కూడ తీసివేయకుండ క్రీస్తుకు అప్పగించటానికి సిద్ధపడ్డాను. ఆయననే డైనైసస్ (Didnysus) మరియు అపాలో (Apollo) మధ్యన జరుగుతున్న ఘర్షణను పరిష్కారం చేయమన్నాను.'' ఈ మాటల ద్వారా వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఎవరైతే జీద్ ను నిందించారో, ఆయనని అనేక విధాలుగా వక్రీకరించారో, అట్లాంటి వారికి ఒక జ్ఞాన జ్యోతిని వెలిగించాడు. ఆంద్రీ జీద్ ఎప్పుడు తనను తాను మోసం చేసుకోలేదు. తన తాత్విక ఆలోచనా అంతరార్థం కేవలం ఉత్సాహవంతమైన తరం కోసం. ఎట్లాగైనా వారిని మేల్కొలిపి అద్భుతాలు చేయాలన్నదే అతని ఆకాంక్ష, అందుకోసమే నిరంతరం తపించాడు.

ఈ రోజుల్లాగానే ఆ రోజుల్లో కూడ ప్రశంసలు కురిపించుట, కృతజ్ఞత భావాలు తెలుపుకోవటం మామూలే. ఎంతో కళాత్మకతను అంతకు మించిన ఇతివృత్తాలతో ఉన్న ఈయన రచనలను మనం చాలా ఆలస్యంగా చూసాము. ఆంద్రీ జీద్ ఎన్నో బాధలలో కూడ ఆనందం వెతికి చూసుకున్నాడు. కాని వాస్తవానికి అట్లాంటి గడ్డు సమస్యలు ఈనాడు మనం దాటవేసినాము. వయసు పండినా కూడ ఆంద్రీ జీద్ తన అనుభూతుల గురించి, అభిప్రాయాల గురించి ఎక్కడా గొప్పగా చెప్పుకోలేదు. ఏనాడు కూడ అవి పరిపూర్ణమైనవని కాని ఆమోదయోగ్యమైనవి అని కాని ఎక్కడ విధించలేదు. అన్నింటిని మించి ఆయన కోరుకున్నది ఒక్కటే బద్ధకంలోంచి తేరుకోవాలని, సమస్యలను నిర్భయంగా వ్యక్తీకరించాలని. భవిష్యత్తులో సహితం ఇతని రచనలపై ఉన్న వివాదం కన్నా ప్రభావమే ఎక్కువ ఉన్నట్లు మనందరం గుర్తిస్తాము అందులో ఏమాత్రం సందేహం లేదు. వాస్తవమైన తన ఉదాత్తమైన స్వభావం తప్పకుండా పునాదులు నాటుకుంటుంది.

తన రచనలలోని ప్రతి పుటలో దేన్నైనా నిర్భయంగా ఎదుర్కొనే సాహసం, చేసిన తప్పును ఒప్పకొనే తత్వం ఉంటుంది. పోరాటానికి ఎంతో కష్టమైనా సరే కాని పవిత్రతను నటించే మతాధిపతులతో సంఘర్షణను మాత్రం వదులుకోలేదు. అట్లాంటి అఘాతం నుండి తప్పించుటకు విలువలులేని ప్రమాణాలను మానవ ప్రవర్తన నుండి వేరు చేసి చూసాడు. ఎవ్వరైనా ఎప్పటికి గుర్తుంచుకోవలసింది సత్యం కోసం తపించే ప్రేమను, దానికోసం కావలసిన నియమాలతో కూడిన ప్రవర్తనను రూపొందించుకోవటం. ఇదే సిద్ధాంతం ఫ్రెంచి సాహిత్యంలో మెంత్యేఇ (Montaigne) మరియు రూసో (Rousseau) నుండి తెలుసుకోవచ్చు. మనకు జీద్ పరిణామం అన్ని దశలలో కనిపిస్తుంది. సాహిత్యంలో ఏక సూత్రతను సాధించిన వాడుగ చివరివరకు దాన్ని కాపాడిన వాడిగ కనిపిస్తాడు. నిజాయితిగా అన్ని సమస్యలను దృఢ నిశ్చయంతో నివేదించిన ఉన్నత వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా గుర్తింపబడ్డాడు.

ఈ కోణం నుండి పరిశీలించి, సుదీర్ఘమైన ప్రతిభావంతునిగా అన్ని కోణాల్లోంచి తన వృత్తిని నిర్వహించిన తీరును, అనేక మార్గాలలో ఉత్తేజపరిచిన, ఆలోచింపజేసిన తన విధానాలు చూసి

ఏ మాత్రం సందేహించని ఆదర్శవంతమైన విలువలకు ప్రతినిధిగా భావించి ఈ బహుమానం ప్రకటించాము.

ఈ విశిష్ట పురస్కారం స్వీకరించటానికి తను సమ్మతం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము. దురదృష్టవశాత్తు అనారోగ్య పరిస్థితి వల్ల ఆయన ఇక్కడికి రాలేకపోయారు. తన బహుమతిని ఇపుడు ఆదేశ రాయబారి స్వీకరిస్తారు.

## జీవిత చరిత్ర

ఆంద్రీజీద్ (1869 - 1951) హ్యూగ్నొనెట్ (Huquenots) కుటుంబం నుండి వచ్చి క్యాథలిసమ్ (Catholicism) లోకి మారాడు. చిన్న తనంలో పలుమార్లు అనారోగ్యానికి గురైతుండేవాడు. దక్షిణ ప్రాంతంలో ఎక్కువ కాలం ఉండటం చేత ఆయన చదువుకు అంతరాయం ఉండేది. అందువల్ల ప్రయివేట్ ట్యూషన్ చెప్పించారు. ఆరోజుల్లో అతని లె కై దాంద్రే వాల్తె (Les Cabiers d' Andre Walter) (1891) (The Books of Andre Walter) ప్రతీక వాద సాహిత్యానికి మార్గం చూపింది. ఆ రోజుల్లో ఆంద్రీ జీద్ ఆల్జేరియాకు చేసిన ప్రయాణంవల్ల తీవ్ర పరిణామాలు చోటు చేసుకున్నాయి. అక్కడే ఆయన అనారోగ్యంతో మరణం అంచులదాకా చేరుకున్నాడు. తలక్రిందులైనటువంటి తన మతంలోని నిష్ఠాగరిష్ఠ పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడినాడు. లెన్యురిత్యూర్ తరస్త్ర (Les Nourritnrs Lerrestres) (1897)(Fruits of the Earth) ఒక నాటకం సేయల్ (Sail) (1903) లో ఆ తరువాత లెరెతూర్ డై ఎన్‌టన్‌ట్ ప్రాదిక్యు (Leretour de l' entant prodique) (1907) (The Return of the prodigal) లాంటి రచనలు ఆయన వ్యతిరేక పోరాటానికి ప్రత్యేక సాక్ష్యాలు.

తన స్వీయ చరిత్ర అయినటువంటి సేల్ గ్రేనె మెర్ (Sile Grain ne meurt) (1924) (If it die....), జీవిత కాలమంతా రాసుకున్న తన డైరీని "Journal జొర్నాల్ 1889 to 1939 (1939) Journal 1939 + 1942 (1948)లో, Journal 1942 to 1942 - 1950 మూడు Journals జొర్నాల్‌గా వచ్చాయి. ఇవి ఆయన వ్యక్తిత్వానికి అద్దం పట్టిన పుస్తకాలు. ఇవేకాక 1914లో వచ్చిన లె కావ్ ద్యు వాటికన్ (Les Caves du vatican) (Latcadio's Adventurse), 1909లో వచ్చిన ల పోర్త్ ఎత్తువత్ (La porte etroite) (Strait is the Gate) మరియు ప్రయోగకరంగా 1926లో వ్రాసినటువంటి అనే ఒక నవల లె ఫా మెన్ ఏర్ (Les Faux Monnayeurs) (The Counter Feiters) రచనలు కూడ చేసాడు.

షేక్స్‌పియర్ (Shakespeare), విటమాన్ (Whitman), కోన్‌డ్రడ్ (Conrad) మరియు (Rilke) రిల్కే లాంటి గొప్ప రచయితల రచనలు కూడ ఫ్రెంచిలోకి అనువదించాడు. జీద్ ప్రభావితమైన సాహిత్య విమర్శకుడు. ముఖ్యంగా వివాదాస్పద రచయిత అయినటువంటి దస్తవిస్కి (Dostoevsky) చే ఎక్కువ ప్రభావితుడై 1923లో ఆయన పైనే ఒక పుస్తకం కూడ రాశాడు. సేకరించిన జీద్ రచనలన్నీ కలిపి పదిహేను సంపుటాలుగా 1933 - 39 లో అచ్చు వేయబడ్డాయి.

# బలివాడ కాంతారావు నవలలు - ఇతివృత్తం

- అద్దంకి శ్రీనివాస్

ఆ మధ్య ''బలివాడ కాంతారావు''గారి మీద అద్దంకి శ్రీనివాస్ ఒక వ్యాసం రాసి పంపారు. ఆ వ్యాసం ప్రచురణకు స్వీకరించేలోపే కాంతారావుగారు మే 6వ తేదీ దివంగతులయ్యారు. వారి మరణానికి **మిసిమి** తన ప్రగాఢ సానుభూతిని తెలుపుకొంటోంది.

- సంపాదకుడు

ఆధునిక సాహిత్యంలో అత్యుత్తమ స్థానం నవలదేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏ సాహిత్య ప్రక్రియైనా ప్రజల ఆదరణపైనే దాని మనుగడ ఆధారపడి ఉంటుంది. దీనినిబట్టి చూస్తే ప్రజల అంతరంగాల్లోకి దూసుకుపోయింది నవల. ఈ రోజు నవల కున్నంత విస్తృతమైన పాఠక లోకం మరే ఇతర సాహిత్య ప్రక్రియకూ లేదు.

''ప్రజ్ఞా నవ నవోన్మేష శాలినీ ప్రతిభా మతీ'' అని భట్టబౌతుడు నిర్వచించాడు. అంటే ప్రతిభ కలిగిన రచయిత తన ప్రజ్ఞత్వం ద్వారా నూతనమైన ఆలోచనా సృష్టిచేయాలి. ఈ నిర్వచనం చక్కగా నవలకు ఉపకరిస్తుంది. ఇంతకుముందు చెప్పినట్లు, అశేష పాఠకాదరణ కలిగిన నవలా ప్రక్రియ ద్వారా ప్రజల్ని రంజింపజేయాలంటే, ఎప్పటికప్పుడు మారుతున్న సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల నాధారంగా చేసుకొని రచన జరగాలి.

నవలకు ఇతివృత్తం హృదయం వంటిది. ప్రజల హృదయాలకు హత్తుకొనే సన్నివేశాలుగాని, రచనా శైలిగాని, కథా కథన సామర్థ్యంగాని, మంచి ఇతివృత్తం ఉన్నపుడే రాణించగలుగుతాయి. ఇతి వృత్తం బలోపేతమైనపుడు, పైన చెప్పిన లక్షణాలన్నీ కలిసి ఆ నవల ఆణిముత్యమై భాసిల్లుతుంది. కానీ ఇతివృత్తం బలహీనమైతే, పై లక్షణాలన్నీ ఉన్నా పైకి అందంగా అలంకరించుకున్నప్పటికీ, హృద్రోగంతో బాధపడే రోగిలా క్షీణించక తప్పదు. ఇతివృత్తానికి అంత ప్రాధాన్యత ఉంది.

క్రీ.శ. 1872లో నరహరి గోపాలకృష్ణ సెట్టి రచించిన ''రంగరాజ చరిత్రము'' తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి నవలగా పరిగణింపబడుతోంది. అలాగే 1878లో కందుకూరి వీరేశలింగం గారు రచించిన రాజశేఖర చరిత్ర, 1921లో ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన 'మాలపల్లి' మొ॥ నవలల ఇతివృత్తాలన్నీ సాంఘిక సంస్కరణోద్యమ దిశలో ఇతివృత్తాలుగా తీసుకొన్నారు. తరతరాల పాతకాలపు భావాల్ని సంస్కరించాలని ఆశించడం ఇక్కడ ప్రధాన ఆశయం.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి నవలలలో మధ్యతరగతి బ్రాహ్మణ జీవితాల్ని ఇతివృత్తంగా స్వీకరించి, సంప్రదాయబద్ధమైన జీవితాలు, నేటి మారుతున్న సమాజంలో ఎలాంటి కష్టాల్నెదుర్కోవాలో వివరించారు. మునిమాణిక్యం, నరసింహారావు గారి నవలల్లో కుటుంబ జీవితాల్లోని సునిశిత హాస్యాన్ని పంచిపెట్టే ఇతివృత్తంతో సాగినై.

స్త్రీ సమస్యల్ని పరిష్కరించాలంటూ, స్త్రీ హృదయాన్ని ఆవిష్కరిస్తూ, స్త్రీ స్వేచ్ఛని సమర్థించే ఇతివృత్తంతో 'చలం' మైదానం, అమీనా, బ్రాహ్మణీకం వంటి నవలల్ని రాశారు. హిందూమత తత్వాన్ని వివరించే ఇతివృత్తంతో 'విశ్వనాథ' వారు కూడా నవలలు రాశారు. ఇక కళాత్మకమైన జీవిత ఇతి వృత్తంతో 'అడవి బాపిరాజు' హిమబిందు, గోనగన్నారెడ్డి, జాజిమల్లి నవలల్ని రాశారు.

1940 తర్వాత ఇతివృత్తంలోనూ, శైలిలోనూ విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఈ పరిణామానికి బుచ్చిబాబు, గోపీచంద్‌లే కారకులు.

బుచ్చిబాబు - చివరకు మిగిలేది, గోపీచంద్ - అసమర్థుని జీవయాత్ర మనో వైజ్ఞానిక నవలలు కాగా, మధ్యతరగతి జీవితాల్లోని నిరాశలూ, నిస్ప్రహలూ, కాంప్లెక్సులూ అన్నింటినీ ఇతివృత్తంగా ఆవిష్కరించడం జరిగింది.

స్వాతంత్ర్యానంతరం తెలంగాణా సాయుధ పోరాటం ప్రభావంతో నవలలు వెలువడ్డాయి: ప్రజలతో సహజీవనం చేసి, వారి విముక్తి కోసం రక్త తర్పణ చేసిన వీరుల జీవన ఇతివృత్తాలతో ఈ నవలలు సాగాయి. ఇందులో 'వట్టికోట ఆళ్వారుస్వామి' ప్రజలమనిషి, గంగు, 'లక్ష్మీకాంతమోహన్' రాసిన సింహగర్జన ముఖ్యమైనవి.

స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్ద నవలల ఇతివృత్తాలలో, సామాజిక మార్పు అవసరమని నొక్కి చెప్తూ, వివిధ వర్గపరమైన సమస్యల్ని, వారి మనస్తత్వాల్నీ విశ్లేషిస్తూ గ్రామీణ రాజకీయ కక్షలకు అద్దం పడుతూ నవలలు వచ్చాయి. వీటిలో 'కొడవగంటి కుటుంబరావు' చదువు, ఐశ్వర్యం, ఎండమావులు ముఖ్యమైనవి.

రావిశాస్త్రి నవలల్లో సామాజిక జీవన స్థితిగతుల్ని ఇతివృత్తంగా తీసుకొని, వివిధ మనస్తత్వాల్ని వివరించారు. అలాగే తెలంగాణాలోని ఫ్యూడల్ భావాలను ఇతివృత్తంగా తీసుకొని 'దాశరథి రంగాచార్య' చిల్లర దేవుళ్ళు నవల రచించారు.

స్వాతంత్ర్యానంతరం శక్తి వంతమైన నవలలు రాసిన వారిలో 'రంగనాయకమ్మ' ఎన్నదగినవారు. మార్క్సిజం ప్రభావంతో, సహజమైన సంఘటనలను, పాత్రలను ఇతివృత్తంగా తీసుకొని బలిపీఠం, పేకమేడలు, జానకి విముక్తి మొదలైన రచనలు చేశారు.

ఈ విధంగా నవలా ప్రక్రియలో ఇతివృత్తంగా స్వీకరించబడని అంశం అంటూ ఏదీ లేదని చెప్పవచ్చు. స్త్రీ సమస్యలపై పోరాడుతూ, స్త్రీ హృదయాన్ని వారి హక్కుల్నీ సాధించాలనే ఆశయంతో అనేక నవలలు వస్తున్నాయి. వీటిలో 'ఓల్గా' స్వేచ్ఛ ముఖ్యమైనది. మరొకవైపు పాఠకుల్ని ఊహాలోకంలో విహరింపజేసే నవలలు కూడా అధికంగా వస్తున్నాయి.

సామాజిక సమస్యల్ని ప్రతిబింబిస్తూ, స్వాతంత్ర్యానంతర దేశ స్థితిగతుల్ని విశ్లేషిస్తూ ఇతి వృత్తాలుగా తీసుకొని అనేక విధాలుగా నవలా ప్రక్రియ సాగింది.

క్రీ.శ. 1927లో శ్రీకాకుళం జిల్లా మడపాం గ్రామంలో జన్మించిన శ్రీ బలివాడ కాంతారావుగారు 37కు పైగా నవలల్ని అనేకమైన నవలికల్ని రచించి ఎనలేని కీర్తి ప్రతిష్ఠల్ని ఆర్జించారు. వీరికి 1976లో 'పుణ్యభూమి'కి రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1986లో 'వంశధార'కు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, 1996లో కళాసాగర్ విశిష్ట పురస్కారం, రావిశాస్త్రి స్మారక పురస్కారం, 1998లో 'బలివాడ కాంతారావు కథలు' సంపుటికి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఇంకా అనేక ప్రశంసా పత్రాలు లభించాయి. జీవన వాస్తవ దృశ్యాల్ని సజీవంగా చిత్రీకరించిన వీరి నవలలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించాయి. ముఖ్యంగా వీరి నవలలు కుటుంబ జీవనాన్ని చిత్రించినవి కొన్ని. మరికొన్ని సామాజిక జీవితాన్ని చిత్రించినవి. ఇంకొన్ని సాంస్కృతిక నవలలు. శారద, కావడికుండలు, బూచీ, సుగుణ, అన్నపూర్ణ, గోడమీద బొమ్మ, ప్రవాహం, సంపంగి, నాలుగు మంచాలు, సుధామధురం, మదనిక మొ॥ నవలల్లో కుటుంబజీవనంలోని సంఘటనల్ని, సన్నివేశాల్ని, ఇతివృత్తంగా తీసుకున్నారు. దగాపడిన తమ్ముడు, వంశధార, పుణ్యభూమి, జన్మభూమి, కర్మభూమి నవలలలో సామాజిక జీవితం ప్రతిబింబిస్తుంది.

మత్స్యగంధి , మన్ను తిన్న మనిషి, ఢిల్లీ మజిలీలు, ఇదే స్వర్గం - ఇదే నరకం, టూరిస్ట్‌బస్, లవ్ - ఇన్ - గోవా, అజంతా, దేవుళ్ల దేశం మొదలైన నవలల్లో మన సంస్కృతికి సంబంధించిన విషయాలే ఇతివృత్తాలుగా సాగినై.

ఇతివృత్తమే నవలా రచనలో కీలకాంశం. తన ఆంతరంగికమైన భావాలు, రచనా దృక్పథం, సామాజిక సమస్యలపట్ల తన అవగాహన వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని, నవలా రచనకు ఇతివృత్తాన్ని ఎన్నుకోవడం జరుగుతుంది.

''కవయః క్రాంత దర్శనః'' అన్నట్లు, సమస్యాత్మకమైన సమస్యల్నే రచయితలు స్వీకరిస్తారు. సాధారణంగా జీవితాన్ని పరిశీలించడం ద్వారా గానీ, లేదా సంఘటనల్ని వినడం ద్వారానో నవలా రచయితకు ముడిపదార్థం దొరుకుతుంది. జీవితంలోని అనుభవాలే సాధారణంగా నవలలకు ఇతి వృత్తాలయ్యాయి. హెన్రీ జేమ్స్ వ్రాసినగొప్ప నవలలన్నీ అతడు ఇతరుల అనుభవాలను ప్రసంగవశాత్తూ తెలుసుకొని వ్రాసినవే.

"The germ or seed of the plot he picked up in some way form life, by observation or hear say" - Henry James.

ప్రసంగవశాత్తూ తెలుసుకొన్న, సందర్భానుసారంగా అనుభవించిన జీవిత సంఘటనల్ని మలచి నవలగా రూపొందించాలంటే ఆ రచయితకు అపారమైన భావనాశక్తి, సూక్ష్మ పరిశీలనా దృష్టి, విశ్లేషణాత్మక దృక్పథం ఉండాలి. ఇవన్నీ బలివాడ కాంతారావుగారికి పుష్కలంగా ఉన్నాయి.

ఇతివృత్త స్వీకరణలో ప్రత్యేకతని చూపించారు బలివాడ కాంతారావు. సమాజంలో విభిన్నమైన వ్యక్తులున్నారు. విభిన్నమైన వర్గాలుకూడా ఉన్నాయి. ఆయా వ్యక్తులూ, వర్గాలూ ఎదుర్కొనే విభిన్నమైన సమకాలీన, సామాజిక సమస్యల్నీ, ఉద్యమాల్నీ ఇతివృత్తంగా స్వీకరించారు.

దీన్ని బట్టే బలివాడ కాంతారావు గారిలో ఏకవర్గ దృక్పథంగాని, పక్షపాత వైఖరిగాని లేదని మనకు తెలుస్తోంది. ఏదో ఒకే వర్గానికి గాని, ఒకే సమస్యకి గాని బలివాడ కాంతారావుగారి ఇతివృత్త స్వీకారం పరిమితం కాలేదు. అందువల్ల వీరి నవలల్లోని ఇతివృత్తాలన్నీ మానవ జీవిత సమస్యలతో నిండి ఉంటాయి. మానవతావాదం అడుగడుగునా దర్శనమిస్తుంటుంది ఆయన నవలలలో.

పాశ్చాత్య సాహిత్యంలోని కాల్పనికవాద ప్రభావం అప్పటికింకా తెలుగు సాహిత్యాన్ని వీడలేదు. ఈ కాల్పనికవాదంలో ప్రకృతి, ప్రణయం, ప్రధానవస్తువులు. దానికినాటి స్వాతంత్ర్యోద్యమం తోడయ్యింది. మరొకవైపు సంఘసంస్కరణోద్యమ ధోరణి కూడా ఉండనే ఉంది. ఈ మూడు వాదాల ప్రభావం బలివాడ కాంతారావు గారి నవలలపై మొదటగా పడింది.

కాంతారావు గారు నూనూగు మీసాల నూత్న యవ్వనంలో ఉన్నపుడు ఈ పరిస్థితుల ప్రభావంతో, 1947లో ప్రణయం, దేశభక్తి ఇతివృత్తంగా గల 'శారద' అనే నవలను రాశారు. కులం, మతం, వర్గం, ఇవేమీ ప్రేమకు అడ్డంకులుగావని, వీటన్నింటిని మానవులే తమ స్వార్థ ప్రయోజనాలకోసం కల్పించుకొన్నవే అని ఈ నవల ద్వారా స్పష్టం చేశారు.

కులమతాల శృంఖలాల్ని ఛేదించాలని ఆకాంక్షించారు. వ్యక్తి శ్రేయస్సు కన్నా సమిష్టి శ్రేయస్సు మిన్న అని ప్రబోధించారు.

తదుపరి నవలలైన 'కావడికుండలు', 'బూచీ'ల ఇతివృత్తాలు కూడా ఈ కోవకు చెందినవే. ఆలోచనా పద్ధతిలోనూ, ఆశయాల సాధనలోనూ అన్నింటా మానవతావాదాన్ని నింపుకోవాలన్న తపన వీరిలో కన్పిస్తుంది.

ఆ తరువాతది 'సుగుణ' నవలిక భార్యభర్తల మధ్య పరస్పర అవగాహన కొరవడితే సంసారం సుఖవంతం కాదు, అనే అంశం ఇతివృత్తంగా కలిగినట్టిది. ఉమ్మడి కుటుంబాలలోని సమస్యల్ని ఇతివృత్తంగా గ్రహించారు 'అన్నపూర్ణ' నవలికలో. ఉమ్మడి కుటుంబాలలో వారసత్వంగా వస్తున్న సంప్రదాయాలని, విభిన్నమైన మనస్తత్వాలమధ్య పొడసూపే వైవిధ్యాల్ని ఈ నవలలో వివరించారు.

'గోడమీద బొమ్మ' నవలలో ఇతివృత్తం ఆస్తి సంఘర్షణకు సంబంధించింది. సమాజంలో ఆస్తి విషయానికి వచ్చేటప్పటికి తండ్రీ - కొడుకులయినా, భార్యాభర్తలయినా, అన్నా చెల్లెళ్ళయినా, ఆ బంధాలు కూడా మటుమాయం అవుతాయని, ఆస్తి వ్యామోహం ముందు రక్తసంబంధం గుర్తుకురాదనే అంశాన్ని ఇతివృత్తంగా స్వీకరించి ఈ నవల రాశారు.

ఇలా చేయడం సభ్యత కాదని, నాగరికత అనిపించుకోదని తెలియజేస్తూ ఆస్తి చుట్టూ అల్లబడిన ఇతివృత్తం గల నవల గోడమీద బొమ్మ. అంతేకాదు ఆస్తి పంపకాలలో ఆదర్శం పనికి రాదు, హక్కులే ప్రధానం అన్న విషయాన్ని కూడా అధిగమించి ఆదర్శభావాలకే ప్రాధాన్యతనిచ్చారు. ఈ నవల దగ్గర్నుంచీ బలివాడ కాంతారావుగారు ఇతివృత్త స్వీకారంలో గొప్ప వైవిధ్యాన్ని కనబరిచారు.

దగాపడిన తమ్ముడు నవలలో పల్లెటూళ్ళలో నివసించే సామాన్య రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఇతివృత్తంగా స్వీకరించారు. ఆ ఇతివృత్తానికి పల్లెటూరి రాజకీయాల్ని జోడించి.

హృదయోల్లాసంగా నవలను తీర్చిదిద్దారు. గుండెల్ని పిండివేసే సంఘటనలెన్నో ఉన్నాయి. తెలుగుదేశంలోని కొన్ని వేల గ్రామాలు, ఒకటి, రెండు వందల పట్టణాలు కొన్ని నగరాలూ ఉన్నాయి. గత శతాబ్ది నుంచి పట్టణాల సంఖ్య పెరుగుతోంది కూడా. గ్రామాలలో నానాటికీ పేద, మధ్య తరగతి రైతుల సంఖ్యా పెరుగుతోంది. అంతకన్నా వేగంగా భూమిలేని వారి సంఖ్యా పెరుగుతోంది. అంతేకాక, కడుపుకట్టుకొని, గడ్డితిని పై అంతస్తు వారి కాళ్ళ కింద పడి ఉంటున్న మధ్యతరగతి రైతులెందరో మనకి కన్పిస్తారు. ఈ స్థితిగతులమధ్య ఎన్నో వైరుధ్యాలు, ఘర్షణలు చోటుచేసుకొంటాయి. ఇలా భూమి సమస్యను ప్రధానంగా తీసుకొని మధ్యతరగతి జీవితాన్ని చిత్రించిన నవలే దగాపడిన తమ్ముడు. అలా దగాపడిన తమ్ముళ్ళు చైతన్యం పొంది భూస్వాముల్ని, దగాకోరు నాయకుల్ని ఎదిరించిన నవల 'వంశధార'.

స్వాతంత్ర్యానికి ముందు వెనుకల శ్రీకాకుళ జన జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొన్నారు. యదార్థ జీవితాలకీ, వాస్తవిక సంఘటనలకు రూపకల్పన చేయబడి 'మాలపల్లి' లో వలె, విస్తృత జీవన చిత్రణ ఇందులో కనిపిస్తుంది. భిన్న భిన్న సిద్ధాంతాల మధ్య సంఘర్షణ విశ్లేషణాత్మకంగా నిరూపించబడింది.

తాగుబోతు కుటుంబాలలోని సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకొన్న నవల 'ప్రవాహం'.

సంప్రదాయ వివాహ వ్యవస్థలోని లోపాల్ని ఇతివృత్తంగా కలిగిన నవల 'సంపంగి'. 'మనువొకచోట మనసొకచోట' అన్న మాటలకు చక్కని వ్యాఖ్యానం ఈ నవల.

పద్మం బురదలో పుట్టినా, దాని అందం అందరికీ ఆరాధనీయమే. అలాగే వేశ్యకులంలో పుట్టిన సంపంగికి మనువొకడితో జరిగినా మనసు కోరుకున్న వాడికే అర్పించి, తన సౌశీల్య సౌరభాలతో కోరుకున్న వాణ్ణేగాక, అతని కుటుంబాన్ని కూడా ఆదుకున్నదే ఈ సంపంగి నవల.

కులం ప్రధానం కాదు. గుణమే ప్రధానం అన్న వాదన కాంతారావు గారిది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కొన్ని రంగాలలో పురోగమనం, మరి కొన్ని రంగాలలో తిరోగమనం కన్పిస్తుంది. ఆయా విషయాల్ని ఇతివృత్తంగా గ్రహించి రచింపబడిన నవల 'పుణ్యభూమి', తరువాత ఇదే ఇతివృత్తం కొంచెం విస్తృత పరిధిని సంతరించుకొంది 'జన్మభూమి' నవలలో. భారతదేశంలోని వివిధ రంగాలలోని అవినీతిని ఎలా నిర్మూలించాలి అన్న విషయంలో తమకంటూ ఉన్న ప్రత్యేకాభిప్రాయాల్ని చూపించిన నవల 'కర్మభూమి'.

ఈ విధంగా పై మూడు నవలల్లో భారతీయ సమకాలీన, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు ఇతివృత్తాలయ్యాయి.

కాంతారావు గారికి కళలన్నా మనదేశ సంస్కృతీ సంప్రదాయాలన్నా మక్కువ ఎక్కువ. అందులోనూ సంగీతమంటే చెప్పనక్కర్లేదు.

సంగీత కళని ఇతివృత్తంగా చేసి పుట్టుగుడ్డివాణ్ణి నాయకునిగా చేసి 'ఇదే స్వర్గం - ఇదే నరకం' అనే నవలని సృజించారు. ఈ నవల ద్వారా కాంతారావు గారు వికలాంగులకు మనోధైర్యాన్ని కలిగించారు.

సంప్రదాయ భావాల మధ్య, ఆధునిక రీతుల మధ్య జరిగే సంఘర్షణని ఇతివృత్తంగా తీసుకొని రచించినది 'నాలుగు మంచాలు'.

అదే విధంగా ఫ్రాయిడ్ మనో విశ్లేషణా సిద్ధాంతాలకి అనుగుణంగా సన్యాసి, సంసారి జీవితాల మధ్య ఘర్షణని ఇతివృత్తంగా గ్రహించి 'ఇదేదారి' నవల రాశారు.

వేశ్యని నాయికగా చేసి త్యాగమయ జీవితాన్ని ఇతివృత్తంగా గ్రహించి మనోజ్ఞమైన శిల్పంతో 'మదనిక' నవలను రాశారు.

కాంతారావు గారి ఇతివృత్త స్వీకారంలో ప్రత్యేకంగా చెప్పుకోవలసింది కొన్ని జాతుల జీవన విధానాన్ని చిత్రించడం, దేశంలోని భిన్న భిన్న జాతుల సంస్కృతుల్ని ఇతివృత్తాలుగా గ్రహించి 'మత్స్యగంధి', 'మన్నుతిన్న మనిషి', 'చైత్రపర్వం' మొదలైన నవలికలు రాశారు.

భారతదేశంలో బౌద్ధమత ప్రభావం తగ్గడానికిగల కారణాలను ఇతివృత్తంగా స్వీకరించి 'అజంతా'ను రాశారు.

అదే విధంగా గోవా సంస్కృతిని, పోర్చుగీసు వారి పాలనను ఇతివృత్తాలుగా చేసి 'లవ్ - ఇన్ - గోవా' 'దేవుళ్ళ దేశం', అనే నవలికలు రాశారు.

విహార యాత్రా నేపథ్యంలో దక్షిణ భారత సంస్కృతికి అద్దం పట్టిన నవల 'టూరిస్ట్‌బస్'.

'ఢిల్లీ మజిలీలు' అన్న నవలలో ఢిల్లీ నగర భౌగోళిక పరిస్థితిని, సమకాలీన సమస్యల్నీ ఇతి వృత్తాలుగా స్వీకరించారు.

ఈవిధంగా కాంతారావు గారు, సమాజంలోని భిన్న మనస్తత్వాల్నీ, ఆచార వ్యవహారాల్నీ, ఆంతరంగిక భావ ప్రవాహాల్నీ వివిధ చిత్త ప్రవృత్తుల్నీ ఇతివృత్తాలుగా స్వీకరించి, సమకాలీన సమాజంలో ఈ లక్షణాలు జీవనం సాగిస్తూ ఉంటే కలిగే సమస్యల్ని, అనుభవం ద్వారా అవగాహన ద్వారా రచించారు.

ఏదైనా సమస్య గురించి చర్చించేముందు గానీ, నవలలో ప్రస్తావించే ముందు గానీ ఎంత శ్రమకైనా ఓర్చి ముందు ఆ విషయాన్ని సేకరించడం వీరి ప్రత్యేకత.

నవలా రచనకు అవసరమైన సామాజిక, చారిత్రక పరిజ్ఞానం, రాజకీయ, ఆర్థిక పరమైన అవగాహన, భారతీయ సంప్రదాయం, సంస్కృతికి సంబంధించిన విషయజిజ్ఞాస ఉన్నపుడే, ఆయా నవలలు జీవితంలోని లోపలి పొరలను ఆవిష్కరింపజేసే వీలుంటుంది.

ఇతివృత్తాల దృష్ట్యా పరిశీలిస్తే వీరి నవలలో స్త్రీ పురుష సంబంధాలు, కుటుంబ సమస్యలు, సామాజిక సమస్యలు, ఆపై దేశ సమస్యలు ఇలా ఒకదాని నుంచి ఒకటి క్రమానుగత పరిణామం వీరి నవలల్లో కన్పిస్తాయి.

వైవిధ్యంతో పాటూ, వైలక్షిణ్యం కల్గిన నవలా ఇతివృత్తాల్ని స్వీకరించడం బలివాడ కాంతారావు గారి ప్రత్యేకత.

# 'వజ్రసూచి కర్తృత్వం'

- టి. రవిచంద్

వజ్రసూచి ( వ్యాససంకలనం) వెలువడిన తర్వాత మహామహోపాధ్యాయ కె. సచ్చిదానంద మూర్తి గారికి పంపాము. ఆయన పుస్తకం పంపినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ రాసిన లేఖలో, వజ్రసూచి గ్రంథకర్తృత్వం విషయంలో చైనా, జపాన్ దేశాలలోని పరిశోధకులు ఏమిచెప్పారని ఒక ప్రశ్న వేశారు. నాకు తెలిసినంతవరకు ఈ దేశాలకు చెందిన బౌద్ధపండితులు, పరిశోధకులు వజ్రసూచి గురించి ఆంగ్లంలో ప్రత్యేకంగా గ్రంథ రచన చేయలేదు. సుప్రసిద్ధ జపాన్ బౌద్ధ పండితుడు, పరిశోధకుడు హాజిమి నకముర **(Hajime Nakamura)** మాత్రం 'ఇండియన్ బుద్ధిజం' ( భారతీయ బౌద్ధం) అనే తమ గ్రంథంలో వజ్రసూచి గ్రంథకర్తృత్వంపై ఆయన అభిప్రాయం రాశారు. ఆయన వజ్రసూచిని 1960వ సంవత్సరంలో సంస్కృత మూలం నుండి జపాన్ భాషలోకి అనువదించినట్టు పై గ్రంథంలోని పాద పీఠికల వల్ల అర్థమౌతుంది. 1931వ సంవత్సరంలో వజ్రసూచి చైనా భాష నుండి జపాన్ భాషలోకి అనువాదమయినట్టు కూడా హెచ్. నకముర తెలిపారు. జపాన్ బౌద్ధ పండితులైన తకకుసు **(Takakusu)**, బ్యోడో **(Byodo)**, వై. కనకుర **(Y. Kanakura)**, కగవ **(Kagawa)** వజ్రసూచి గ్రంథ రచయిత గురించి తమ రచనల్లో చర్చించినట్టు తెలుస్తోంది. వీరిలో కగవ ఒక్కరే అశ్వఘోషుడు వజ్రసూచి గ్రంథకర్త కాదన్నారు. ఈయన పూర్తిగా చైనా భాషాంతరీకరణంపై ఆధారపడే ఈ అభిప్రాయం ప్రకటించి ఉండవచ్చు. హెచ్. నకముర మాత్రమే సంస్కృతమూలంపై ఆధారపడి వజ్రసూచిపై గ్రంథ రచన చేశారు. అందువల్ల ఆయన అశ్వఘోషుడు. వజ్రసూచి గ్రంథ రచయిత కాదని తొందరపడి ఒక నిర్ణయానికి రాలేదనిపిస్తుంది. చైనా దేశానికి సంబంధించిన పరిశోధకులు ఈ విషయంపై ప్రత్యేకంగా ఏమి చెప్పారో తెలియదు. ఆ దేశ పరిశోధకులు ఈ అంశంపై ఏమయినా ప్రత్యేకమైన పరిశోధన చేసి ఉంటే నకముర 'ఇండియన్ బుద్ధిజం' లో తప్పకుండా ప్రస్తావించి ఉండేవారు. ఆయన ఈ గ్రంథంలో భారతీయ బౌద్ధంపై ప్రాచ్య, పాశ్చాత్య రచయితల అభిప్రాయాలన్నింటినీ దాదాపు పేర్కొన్నారు. ఈవిషయంలో ఆయన ప్రామాణికమైన కృషి చేసి ఉన్నారు. వజ్రసూచి గ్రంథ కర్తృత్వం విషయంలో చైనా పరిశోధకులు చెప్పుకోదగ్గ పరిశోధన చేసి ఉంటే సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ తమ పరిశోధనా వ్యాసం ''ది వజ్రసూచి ఆఫ్ అశ్వఘోష: ఏ స్టడీ ఆఫ్ సాంస్క్రీట్ టెక్స్ట్ అండ్ చైనీస్ వర్షన్'' లో పేర్కొని ఉండేవారు.

హాజిమినకముర భారతీయ తత్వ శాస్త్రంపై ప్రామాణికుడు **(an authority)** ఆయన 86 ఏళ్ళ వయసులో మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ అక్టోబరు 10, 1999 సంవత్సరంలో టోక్యోలో మరణించారు. ఆయన మరణం జపాన్ బౌద్ధులకే బాధాకరమయింది కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులు, బౌద్ధ సాహిత్యాభిమానులతో పాటు భారతీయ తత్వశాస్త్రాభిమానులందరికి బాధాకరమయిన విషయం. 1964 సంవత్సరంలో ఆయన రచించిన ''వేస్ ఆఫ్ థింకింగ్ ఆఫ్ ఈస్టర్న్ పీపుల్స్'' గ్రంథంతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఇప్పటికీ ఈ గ్రంథాన్ని అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో పాఠ్య గ్రంథంగా అధ్యయనం చేస్తున్నారు. బౌద్ధసాహిత్యం లభిస్తున్న ప్రపంచంలోని ముఖ్యమైన దేశాల భాషలన్నీ ఆయనకు పరిచయం. పాళీ, సంస్కృత భాషల్లో గొప్ప పండితుడు.

ఈ భాషల్లో లభిస్తున్న సాహిత్యాధారాలతో 1992వ సంవత్సరంలో 'గోతమబుద్ధ' (గౌతమ అనే సంస్కృత పదాన్ని కాకుండా గోతమ అనే పాలీ మూలరూపాన్నే ఆయన గ్రంథనామంలో ప్రయోగించారు) గ్రంథాన్ని జపాన్ భాషలో రచించారు. దీని ఆంగ్లానువాదం ''ధర్మవరల్డ్'' (ద్వైమాస పత్రిక) అనే జపాన్ నుండి వెలువడుతున్న పత్రికలో ప్రచురిస్తున్నారు. ఇది చదివిన ఎటువంటి పాఠకుడయినా నకమురకు పాలీ, సంస్కృత భాషల్లో ఉన్న పాండిత్యాన్ని చూసి ఆశ్చర్యపోవాల్సిందే. ఆయన రచనల్లో పేర్కొన తగినవి: 1. ఏ హిస్టరి ఎర్లీ వేదాంత ఫిలాసఫి 2. బుద్ధిజం ఇన్ కంపారటివ్ లైట్3. ఎర్లీ బుద్ధిజం 4. ఏ కంపారటివ్ హిస్టరి ఆఫ ఐడియాస్ 5. హిస్టరి ఆఫ ది డెవలప్‌మెంట్ ఆఫ జాపనీస్ థాట్ 6. గోతమ బుద్ధ (జాపనీస్). మూడు దశాబ్దాలకు పైగా యూనివర్సిటీ ఆఫ టోక్యోలో భారతీయ బౌద్ధ దర్శనాచార్యుడిగా పనిచేశారు. విశ్వవిద్యాలయం నుండి పదవీ విరమణ చేసిన తర్వాత 1973లో నకముర 'ఈస్టర్న్ ఇనిస్టిట్యూట్' స్థాపించి ప్రాచ్యదర్శనాల్ని బోధించేవారు. ఆయన జీవితంలో చివరి సంవత్సరం ఆరోగ్యం పూర్తిగా క్షీణించినా లెక్కచేయకుండా 'వాళ్ళు నాకోసం ఎదురుచూస్తుంటారంటూ' చక్రాల కుర్చీలో క్లాసులకు వెళ్ళి పాఠాలు చెప్పేవారు. ఆయన తన పూర్వ విద్యార్థులు క్లాసుల్లో పాఠాలు చెబుతుంటే, ఒక ప్రక్కన కూర్చొని ఉపన్యాసం మధ్యలో ఏదయినా సమస్య తలెత్తితే లేచి నిలబడి వివరించేవారు. ఆయన పూర్వ విద్యార్థుల్లో ఒకరైన షిజుకనెడా ఈ సంఘటన గురించి చెబుతూ ఇలా అన్నారు ''ఆయన్ని అక్కడ చూడటంతోనే రక్షణ లాంటి భావనకలిగేది. ఆయన మాకు బుద్ధుడు లాంటివాడు.'' జీవితాంతం దాకా హాజిమినకముర నిజమైన ఉపాధ్యాయుడిగా జీవించారు. ఇటువంటి ఉన్నత విలువలు కలిగిన ఉపాధ్యాయుడ్ని భారతమాజీ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా వాచస్పతి బిరుదుతో సత్కరించారు. నేడు మన సమాజంలో అన్ని రంగాల్లో విలువలు దిగజారినట్టే విద్యారంగంలో కూడా అనైతిక పద్ధతులు ప్రబలినాయి. నేడు కొంతమంది ఉపాధ్యాయులు అన్ని విలువల్ని వదిలేసి కేవలం గుర్తింపుకోసం, పదవులకోసం తమ పూర్వ విద్యార్థులకు న్యాయంగా రావాల్సిన అవకాశాల్ని కూడా ఏదోకుంటి సాకుతో తమవిగా అవినీతి పద్ధతుల్లో స్వంతం చేసుకొంటున్న వైనాన్ని చూస్తుంటే నకముర లాంటి ఆదర్శ ఉపాధ్యాయులు తమ పూర్వ విద్యార్థులకు 'బుద్ధుడి'లా కనిపించటంలో ఆశ్చర్యం ఏమాత్రం లేదు. కలకత్తాలోని విశ్వభారతి దేశికోత్తమ బిరుదుతో సన్మానించింది. భారతదేశంలోని అనేక పరిశోధనా సంస్థల్లో ఆయన సభ్యులు. హార్వర్డు విశ్వవిద్యాలయం, స్టాన్‌ఫర్డు విశ్వవిద్యాలయం, స్టేట్ యూనివర్సిటీ ఆఫ న్యూయార్క్, యూనివర్సిటీ ఆఫ హవాయి, యూనివర్సిటీ ఆఫ ఫ్లోరిడాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. రాయల్ ఏసియాటిక్ సొసైటి ఆఫ గ్రేట్ బ్రిటన్ అండ్ ఐర్లండులో గౌరవ సభ్యులు. ఆస్ట్రియన్ అకాడెమీ ఆఫ సైన్సెస్ (వియన్నా) లో కరస్పాండింగ్ సభ్యులు.

ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి లేఖ నవంబరు 27వ తేదీన అందింది. అప్పటికి నెలరోజుల క్రితం ప్రొఫెసర్ హెచ్. నకముర మరణించారు. ఆయన మరణ వార్తను తెలియచేస్తూ 'ది హిందు' (దినపత్రిక) అక్టోబరు 21, 1999లో ప్రొఫెసర్ ఎన్.హెచ్. సంతాని (గౌరవాచార్యులు, నాగార్జున విశ్వవిద్యాలయం) ఒక లేఖ రాశారు. ప్రొఫెసర్ నకముర మరణించిన విషయం ఈ వ్యాసరచయితకు సంతాని లేఖ ద్వారానే తెలిసింది. జపాన్ నుండి వెలువడే బౌద్ధ ద్వైమాస పత్రిక 'ధర్మ వరల్డ్' లో నకముర మరణవార్త

జనవరి/ఫిబ్రవరి 2000 సంచికలో వచ్చింది. ఆయనంటే నాకెంతో గౌరవం. ఆయన రాసిన 'ఇండియన్ బుద్ధిజం' (ఏ సర్వే విత్‌బిబ్లియోగ్రఫికల్‌నోట్స్) తొలి భారతీయ ముద్రణ 1987లో వెలువడిన వెంటనే తెప్పించుకొని చదివాను. ఇండియన్ బుద్ధిజంలో భారతీయ బౌద్ధంలోని అన్ని అంశాల్ని అవలోడనం చేశారు. భారతీయ బౌద్ధంపై చైనా, జపాన్ పండితులు, పరిశోధకులు చేసిన రచనల్ని కూడా విశ్లేషించారు. అందువల్ల ప్రొఫెసర్ సచ్చిదానంద మూర్తి వజ్రసూచి గ్రంథ కర్తృత్వంపై చైనా, జపాన్ పరిశోధకులు ఏమి చెప్పారని ప్రశ్నించినప్పుడు వెంటనే ఈ గ్రంథం జ్ఞప్తికి వచ్చింది. హెచ్. నకముర వజ్రసూచి గ్రంథ కర్తృత్వంపై ప్రత్యేకంగా పరిశోధన లాంటిది చేయక పోయినా జర్మనీ, జపాన్, చైనా, భారత దేశాల్లో దీనిపై గ్రంథ రచన చేసిన ముఖ్యమైన పరిశోధకుల రచనల్ని సంప్రదించారు. భారతీయ పరిశోధనల్లో సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ గ్రంథాన్ని ప్రామాణిక రచనగా పరిశీలించారు. చైనాలో లభిస్తున్న వజ్రసూచి గురించి సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ తమ గ్రంథంలోయ( ముందుమాట, పే. XII) ఏ అభిప్రాయాన్నయితే ప్రకటించారో దాదాపు అదే అభిప్రాయాన్ని హెచ్. నకముర 'ఇండియన్ బుద్ధిజం' లో పునరుద్ఘాటించారు. ఆయన మాటల్లోనే చూద్దాం : It is likely that the main part of it was composed by Asvaghosha and was enlarged gradually in later days, and finally was promulgated with the name of Dharmakirti as the author (ఇండియన్ బుద్ధిజం, మోతీలాల్ బనార్సిదాస్, తొలిముద్రణ (ఇండియా) 1987 పే. 291). దీని ప్రధాన భాగాన్ని బహుశ అశ్వఘోషుడు రచించి ఉంటాడు. తర్వాత రోజుల్లో దీన్ని క్రమేణా పెంచుకొంటూ పోయి, చివరకు ధర్మకీర్తిని గ్రంథరచయితగా ప్రకటించి ఉంటారు. హెచ్. నకమురవజ్రసూచి అశ్వఘోషుడి రచన కాదని మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. ఎందుకంటే ఆయన సంస్కృత మూలాన్ని జపాన్ భాషలోకి అనువాదం చేసి ఉన్నారు. సంస్కృత మూలంలో అశ్వఘోషుడే గ్రంథకర్త. కేవలం చైనా భాషలో ఉన్న వజ్రసూచి మాత్రమే ధర్మకీర్తి పేరుతో ప్రచారంలో ఉంది. దీనిపై సుజిత్‌కుమార్ ముఖోపాధ్యాయ మౌలిక పరిశోధనచేశారు. ఆయన అభిప్రాయంతో నకముర పూర్తిగా ఏకీభవించారని పై మాటల వల్ల విశదమౌతుంది. 1949వ సంవత్సరం తర్వాత ప్రపంచంలోని ఏ నిష్పాక్షిక పరిశోధకుడు వజ్రసూచి గురించి చర్చించినా సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ గ్రంథాన్ని సంప్రదించాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే ఆయన సంస్కృత మూలాన్ని, చైనా భాషాంతరీకరణాన్ని (Chinese Version) తులనాత్మకంగా అధ్యయనం చేసి, వజ్రసూచి అశ్వఘోషుడి రచన కాదని చెప్పడానికి తగిన ఆధారాల్లేవన్నాడు. ఈ అభిప్రాయంలోని ఔచిత్యాన్ని హెచ్. నకముర లాంటి అంతర్జాతీయ ప్రసిద్ధిచెందిన బౌద్ధపండితులు గుర్తించారు. సుజిత్ కుమార్ ముఖోపాధ్యాయ గ్రంథాన్ని సినో - ఇండియన్ కల్చరల్ సొసైటి, శాంతినికేతన్ తరపున 1950వ సంవత్సరంలో ప్రచురించింది. ఈ సంస్థతో సమకాలిక చైనా పండితులందరికీ సంబంధాలున్నాయి. దీని స్థాపక - డైరెక్టర్‌తాన్ యున్ షన్ (Tan Yun - Shan). ఈయనకు ప్రాచీన చైనా, ప్రాచీన భారత దేశ సాంస్కృతిక సంబంధాలపై మంచి పరిశోధనకుడిగా, రచయితగా గుర్తింపు ఉంది. ఈయన ఈ రెండు దేశాల సాంస్కృతిక, మత, దార్శనిక సంబంధాలపై అనేక గ్రంథాలు రచించారు. ఈయన డైరెక్టర్‌గా ఉన్నప్పుడే వజ్రసూచి ప్రచురించబడింది. ఒక చైనా పండితుడే డైరెక్టర్‌గా ఉన్న సంస్థ ప్రచురించిన గ్రంథం ప్రపంచంలోని ఏ బౌద్ధ పండితుడయినా గుర్తించక తప్పదు.

# 'నూతి'లో గొంతుకల 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం!

**- నరేష్ నున్నా**

యుగాలుగా ప్రవహిస్తూ వస్తున్న మానవ ఉద్వేగ, వికాసాలతో పాటు అంతర్వాహినిలా వస్తున్నది కవిత్వమే. అటువంటి 'కవిత్వ' ప్రాశస్త్యాన్ని, ప్రాసంగికతని, ప్రయోజనాన్ని ప్రస్తావించుకోవడం అసందర్భం, అప్రస్తుతం కాదుగానీ, అధిక ప్రసంగం అవుతుందేమో. ఒక గొడుగు కింద లేకున్నప్పటికీ 'భరత వర్షం' సాహిత్యాత్మ ప్రతిఫలించేంది ఆకాశంలా అనాది అయిన కవిత్వంలోనే. ఋగ్వేద శ్లోకమే మనుష్య జాతి మొట్టమొదట పలికిన కవిత్వమని మోక్షమూలభట్టారకుని (మాక్స్‌ముల్లర్) అభిప్రాయం కూడా. చరిత్రని చీరిన నెత్తుటిగాయాల చిహ్నాల్ని, చరిత్రని భద్రపరిచిన మొండిగోడల సాక్ష్యాల్ని బహిర్భూమి అవసరంతో మాత్రమే లంకవేసి చూడగలిగిన జాతి 'రామమందిర' మంటూ, 'చారిత్రక' హింసాత్మక భక్తితో గంతులేసినట్లు గానే, ఆ కోవకు చెందిన కొంతమంది సనాతన సంప్రదాయవాదులు - ఈజిప్టులానో, చైనాలానో మనంకూడా పంచ సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని, వలసవాదుల '2000' తో మనకేమిటి పని అని యాగీ చేస్తున్నారు.

మన ఆంధ్రదేశం విషయానికొస్తే, ఒక మిలీనియం కవిత్వ చరిత్ర మనది. నన్నయ్య మన ఆదికవి ('లిఖితమైతేనే కవిత్వ' మనే వలసవాద, బ్రాహ్మణ వాద దృష్టి సంకుచితమని, జనపదాల్ని, వారసత్వసంపదగా అందిస్తున్న 'బహుశ్రుతులైన ఎందరో **anonymous** కవులున్నారని, నన్నయ్యని ఆదికవిగా గుర్తించడం తప్పని 30 ఏళ్ళుగా వాదిస్తున్న వేల్చేరు నారాయణరావును సౌలభ్యం దృష్ట్యా మర్చిపోయి మాట్లాడుకుందాం; 'నాతో సహా ఓ అరడజను మంది (ఆధునిక) కవుల్ని చదువుకుంటే చాలు, 'నిన్న'టి సంప్రదాయ సాహిత్యమంతా శుద్ధ దండగ' అని ఆధునిక ఆంధ్రసాహిత్య లోకానికి గొప్ప తరుణోపాయం చెప్పిన కుందుర్తి బాటలోనే మున్ముందు నడుద్దాం). ఈ వేయేళ్ళ చరిత్రలో గురజాడ ముందు సుమారు 9 శతాబ్దాలు తీసుకుంటే, పాశ్చాత్య సాహిత్యలోకానికి, మన సాహిత్యలోకానికీ ఎన్నో వైరుధ్యాలున్నాయి. అయితే, వస్తు, రూప వైరుధ్యాలు ఎన్ని ఉన్నా, ఒక ముఖ్యమైన సారూప్యత కూడా ఉందనిపిస్తోంది. అదేమంటే, పడమటి వారుగానీ, మనంగానీ ఎవరి ప్రపంచాలకు మించి వారు చూడలేకపోవడం. ఈ సారూప్యత ఉన్నంతమాత్రాన ఆయా ప్రపంచాల పరిమాణం ఒకటేనని మాత్రం కాదు. 'గత మంతా తడిసె రక్తమున / కాకుంటె కన్నీళులతో' అన్నాడు శ్రీశ్రీ. నెత్తుటిధారలో, కన్నీటి చారికలో అంటిన 'గతం' అందరికీ ఒకేలా ఉంటే, ఆ నిన్నటి 'వర్తమానా' నికి బింబంవంటి సాహిత్య ప్రపంచంలో వైరుధ్యాలు, బహుశా తీవ్రవైరుధ్యాలెలా వచ్చాయి. డాంటే ప్రపంచానికీ, తిక్కన ప్రపంచానికీ అంతవైరుధ్యమేమిటి (ఇది వస్తురూపాల మధ్య పోలికకాదు)? మనిషి విశ్వరూపాన్ని దర్శించి, ప్రదర్శించిన షేక్స్పియర్ నాటి మన కవుల ప్రపంచమేమిటి (ప్రతిభా వ్యుత్పత్తుల సాపేక్ష చర్చకూడా కాదు)? మచ్చలై మిగిలే గాయాలు, అవి నేర్పే పాఠాలకు సంబంధించినదే ఈ చర్చ. 'గాయాలనుంచి కించిత్తయినా గుణపాఠాలు నేర్చుకోని జాతి' అంటాడు - మనది **'Wounded Civilisation'** గా వ్యాఖ్యానించిన **V.S. Naipaul.** కానీ, 'గాయాలు తగలని జాతి' అనుకుంటాను నేను (వేనవేల 'నేను'ల పాఠక సమూహంలో దేనికదే స్వీయాస్తిత్వం ఉన్న

ఒకానొక 'నేను'ను మాత్రమే). ఇంకా Precise గా చెప్పాలంటేగాయాల్ని అనుకూలంగా, సౌఖ్యాలుగా మార్చుకున్న మైనారిటీ వర్గాలు (వర్ణాలు), గాయాలన్న స్పృహే లేకుండా 'నిష్కామ' వేదనని అనూచానంగా భరించిన మెజారిటీ వర్గాలుగా చీలి ఉన్న జాతికి గాయాలు నేర్పే అనుభవాలు లేకపోవడంతో ఆశ్చర్యమేముంది.

గాయాలవల్ల ఘర్షణలే కాదు, సంఘర్షణలు కూడా పుడతాయని పాశ్చాత్య ప్రపంచాన్ని వెల్లువెత్తిన పునరుజ్జీవన, వికాస, కాల్పనిక, భావ, ఆధునిక వాదోద్యమాలు నిరూపించాయి. ఆలోచన పెరుగుతున్న కొద్దీ సంక్షోభమయమవుతున్న మానవ జీవితం; ఆంతర్యం ఆవిష్కారమవుతున్న కొద్దీ సంక్లిష్ట భరితమవుతున్న మనిషి - ఈ రెండూ కొత్త సాహిత్య రూపాలైన 'కథ', 'నవల' లు అంకురించడానికి మూలమయ్యాయి. అన్ని గాయాలూ ఒక ఎత్తైతే, ఈ శతాబ్దం అనుభవించినరెండు ప్రపంచ యుద్ధాలు చేసినగాయాలు మరో ఎత్తు. సంస్కారవంతమైననేల (జర్మనీ) కి అమానవ నాజీయిజాన్ని నేర్పించడం, వర్గ వివక్షకి నిలువెత్తురూపమైన conservative నేల (ఇంగ్లాండ్) కి మనిషితనాన్ని బోధించడం, మహా ప్రపంచయుద్ధ పాతాలలో ఒకానొక అధ్యాయం. ఆ పాతాలు అనంతమైన, మహోత్కృష్టమైన సాహిత్య సృజనకి దారితీశాయి. సాహిత్య ప్రక్రియల్ని ఎంతో సుసంపన్నం చేశాయి. కనుక పాశ్చాత్య ఆధునిక సాహిత్యం నిన్నటి దుఃఖ సందర్భం, విషాద కవిసమయమూనూ -

ఏ దుఃఖమూ లేనందువల్ల గానం, చిత్రకళ, శిల్పం.... వంటి లలిత కళలు ఎంతగా అభివృద్ధి చెందాయో, సాహిత్యం అంత సంకుచితమై పోయింది మన భారతదేశంలో (తిక్కన, పెద్దన, పోతన, పాల్కురికి.. ప్రభృతుల వ్యక్తి గత ప్రతిభకు సంబంధించిన వ్యాఖ్య కాదిది). దేనికదే ఓ ప్రపంచంగా బ్రతుకుతున్న నాటి భారతదేశం రాజ్యాలు అన్నింటిలోనూ అంతస్సూత్రంగా కనిపించే సారూప్యగుణం ఈ దుఃఖరాహిత్యమే. అటువంటి 'భరత వర్షా'న్ని అఖండంచేసిన వలసపాలన - కొందరు ద్విగ్గంతుల పుట్టుకకి కారణమయింది. కొట్టి వేసుకుంటూ, సరిదిద్దుకుంటూ పాశ్చాత్య ప్రపంచం ఆరు శతాబ్దాలుగా చవి చూసిన అనుభవాన్ని, రెండు శతాబ్దాలలోనే భారతదేశం చవిచూడటం (చవి చూసిందనిపించడం) సామాజికంగా చాలా కీలకమైన అంశం. అక్కడ జీవితాన్ని మెన్నుదన్ని భావోద్యమాలు పుడితే, జీవితానికి ఏమంత సంబంధంలేని మేధో యాతనలుగా మాత్రమే ఇక్కడ ఉద్యమాలు మిగిలాయి. కనుక, రాజారామ్మోహన్‌రాయ్, ఎం. ఎన్. రాయ్, గురజాడ, సత్యజిత్‌రే... వంటి మేధావుల పుట్టుకకి మాత్రమే ఆ ఉద్యమాలు, భావనలు దారితీసాయి. ఈ మేధావులు తమ విశేష అధ్యయనం ద్వారా కలిగిన అనుభవాన్ని (పాశ్చాత్యుల స్వానుభవాన్ని), వారి వ్యక్తిగత పరిశీలనానుభవంతో జోడించి సంస్కరణలకి పూనుకున్నారు. అంటే ఒక సహానుభవంతో స్వానుభవాల్ని తూచే ప్రయత్నమన్నమాట. 'తెలివి మీరినతనం' అని కూడా దీనిని పిలవొచ్చు (వారి చిత్తశుద్ధి, వారి త్యాగాలు శంకించవలసినవి కావు. ఈ 'తెలివి మీరినతనం' కేవలం వారి limitation మాత్రమే). ఈ సహానుభవ, స్వానుభవాలు binary oppositions (జాక్ డెరిడా పదం) అని నా అభిప్రాయం (ఆంధ్రదేశం సాహిత్యలోకంలో కూడా (అధికార) ప్రమాణంతో మరొకదాన్ని కొలిచే

ఈ ధోరణి - ఆధునికోత్తర దశ అని ప్రకటించుకుంటున్న - వర్తమానంలో కూడా కొనసాగుతోంది). ఈ మేధావులందరూ మన 'గతా'న్ని రద్దు చేసుకొని, పాశ్చాత్య (నాటి) వర్తమానాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. కానీ, 'గతం' ఎప్పుడూ రద్దయ్యేది కాదు. 'వర్తమాన' దేహానికి రక్త మాంసాలన్నీ 'గతా'నివే. ఈ విషయం ఆ మేధావులు గ్రహించలేదా? అంటే నాకు సందేహమే. 'మౌలికత' ప్రాముఖ్యతనీ ఎంతగానో వివరించిన 'ఇంగ్లీషు - చదువులు' చదివిన ఆ మేధావులు 'గతా'న్ని రద్దు చేయడం (లేదా చేశారని ఆరోపించడం) సబబుకాదేమో. నిజానికి వారు 'గతా'న్ని రద్దు చేయలేదు. మనకంటూ ఒక 'గత' ముందని మరిచారు. లేదా, 'గతా'న్ని కన్వీనియెంట్‌గా ignore చేయడానికి ప్రయత్నించారు. కచ్చితంగా ఈ 'convenience' ఎన్నో అన్నో అనర్థాలు తెచ్చి పెట్టింది. కన్వీనియెంట్‌గా కప్పదాట్లు వేయడం, అనుకున్న conclusion కి అడ్డువస్తున్నాయని పించిన వాటిని చూడనట్లు నటించడం, ఆశించిన గమ్యాలకై అడ్డదార్లు వెదకడం. ఇత్యాదులు, నాటి మేధావులకు (వారి వారసత్వంగా నేటి మేధావులకు కూడా) అలవడ్డాయి (బెంగాల్ మంచి ఉదాహరణ).

ఇంతవరకూ మేధావుల మధ్య సారూప్యత కనిపించినా, భారతదేశంలోని అన్ని భాగాలలో ఆధునిక సాహిత్య ప్రస్థానంలో మాత్రం ఇటువంటి సారూప్యత లేదు. ఎన్నో కొన్ని గాయాలైనా అనుభవించిన ఉత్తర భారతదేశం, అందులో మేధావుల కార్ఖానా వంటి బెంగాల్, మహారాష్ట్రలను మినహాయించి, అతిభద్రమైన దక్షిణ భారతదేశాన్ని తీసుకుంటే తమిళనాడులో కనిపించే రాజకీయ విప్లవస్పృహగానీ, కర్నాటక, కేరళలో కనిపించే సాంస్కృతిక విప్లవ స్పృహగానీ తెలుగునేలకు లేవు. భద్రమైన దక్షిణ దేశంలో, అతిభద్రమైన ఈ నేలమీద వికసించిన బౌద్ధం - ఆధ్యాత్మికంగా, తాత్వికంగా తెచ్చిన పరిణామం (సాపేక్షంగా) శూన్యమే అయినా, సాంఘికంగా తెలుగువారికి ఒక cosmopolitan స్వభావాన్ని అలవర్చింది. కాస్మోపాలిటన్ ప్రవృత్తిలో పాజిటివ్ అంశాలతో పాటు, మహా మహమ్మారి లాంటి 'detachment' అనే లక్షణం కూడా ఉంటుంది. నీళ్ళమీద నూనెలాగా ఏ అంశంతో అయినా ఆంధ్రులలో ఈ బంధరాహిత్యమే కనిపిస్తుంది. అంశాలను నిర్వికారంగా, నిర్మమత్వంతో ఆబ్జెక్టివ్‌గా అంచనా వేయడానికి మాత్రం పనికిరాని బంధరాహిత్యమిది! ఏ పరిస్థితులనైనా ఆహ్వానించి, వేటికయినా mould అయిపోయి, accomodative గా ఉండగలిగే కాస్మోపాలిటన్ పౌరుడికి ఏ అంశంపై అయినా 'నాది' అనే స్పృహ ఉండదు. ద్రావిడ భాషలపై ప్రపంచంలోనే అత్యుత్తమ మైన స్కాలర్లలో ఒకరైన భద్రిరాజు, భాషకు విశిష్టమైన సేవలందించిన స్వర్గీయ తిరుమల రామచంద్ర, బూదరాజు వంటి ఉద్దండులు ఉన్నప్పటికీ, సాహిత్యానికే గాక, సంస్కృతికి ప్రాణాధారమైన 'భాష' దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంత చలన రహితంగా, మృతప్రాయంగా ఉండటానికి ఈ కాస్మోపాలిటన్ తత్వమే కారణం. కనుక, స్వాభావికంగానే సమస్యని దాటవేసే మనస్తత్వం ఉన్ననేలకి, పైన చెప్పుకున్న 'తెలివి మీరిన తనం' అలవాటు కావడంతో అగ్నికి అజ్యం తోడయినట్లయింది.

Ends (గమ్యాలు), means (మార్గాలు) అవిభాజ్యాలనీ, గమ్యాన్ని సాధించడానికై, ఎంచుకునే మార్గంలోని ప్రతి బిందువూ గమ్యమే అవుతుంది కనుక, రెండూ వేర్వేరు కాదనీ ఆధునిక తాత్విక

చేతన బోధిస్తుంది. కానీ, గమ్యాలకి అడ్డదార్లు వెదకడంలో పడి, గమ్యాలు కూడా మరిచి, అడ్డదార్లకై వెదుకులాటే గమ్యం చేసుకుంది ఆంధ్రామేధావిలోకం.

(నోట్ 1: అన్ని రంగాలకూ (విస్తరించిన) వర్తించే ఈ లక్షణానికి ఒక ఉదాహరణగా ప్రజాప్రతిఘటన రంగాన్ని తీసుకుందాం. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా ప్రజలు విప్లవించాలంటే, స్వాభావికంగా **ritual disobidiance** ఉండే మన ప్రజల పెనునిద్దరను వదిలించి, వారిని సమాయత్త పరచాలి. సమస్యని దాటవేసే వారి మనస్తత్వాన్ని తుడిచి, సమస్యని ఎదుర్కొనేలా చేయాలి. ఇటుకలతో గోడ కట్టినట్టు క్రమేణ, పకడ్బందీగా చేయాలి. కానీ, అంత తీరిక, ఓపిక, శ్రద్ధ, చిత్తశుద్ధి, పోనీ అసహనమైనా ఉండటమంటే కష్టమే కనుక, 'సాయుధ పోరాట' మనే **short cut method** ని ఎంచుకుంది ఇక్కడ ఒకవర్గం. ప్రజలతో సంబంధం లేకుండానే, ప్రజాయుద్ధం నడుపుతుంటుంది. కనుక దేశంలో ఎక్కడా లేనంతగా ఈ 'ప్రజా ప్రతిఘటన యుద్ధం' ఆంధ్రదేశంలో జరగడం స్వాభావికంగానే సహజాతి సహజం. ప్రజలకు సంబంధం లేదన్నంతమాత్రాన ప్రజల సానుభూతి, అప్రకటిత సంఘీభావం లేదని అర్థంకాదు. రాజ్యాన్ని ఎదిరించినట్లు కనిపించే వరదరాజ మొదలియార్లు, దావూద్ ఇబ్రహీంల పట్ల ఉండే 'హీరో' చిత ఆరాధన భావమే 'పీపుల్స్‌వార్' మీద కూడా ఉంది.

(నోట్ 2: ఈ ప్రజాప్రతిఘటన యుద్ధా (ప్ర. ప్ర. యు) నికి, మన చర్చనీయాంశమైన ఆధునిక ఆంధ్రసాహిత్య చరిత్రకీ కొంత అవినాభావ సంబంధముంది కనుక, ప్ర.ప్ర. యు. గురించి అప్రస్తుతమనిపించే ప్రస్తావన చేయవలసి వచ్చింది).

అలా అడ్డదార్లు వెదికే ప్రయత్నంలో సాహిత్య మేధావులకి చిక్కిన ప్రక్రియే 'కవిత్వం'. తెలుగు ఫార్ములా సినిమాలలో ఎటువంటి క్లిష్టమైన అంశాన్నైనా 'పాటల' రూపంలో చెప్పేసినట్లు, ఆంధ్ర సాహిత్య లోకం కూడా ఆధునిక జీవన రహస్యాన్నంతా కవిత్వంలో చెప్పేసే ప్రయత్నం చేసింది (చేస్తోంది). ఆధునికతకి అధ్యుడైనగురజాడలో ఒకవైశిష్ట్యం ఉంది. రక్తం పరవళ్ళు తొక్కే వయసులో కవిత్వం, ఏరు మైదానంలో ప్రవేశించాక వచనం, పరిపక్వమయ్యాక నాటకం... ఇలా ఉండవచ్చు ఏ రచయిత పరిణామమైనా. కానీ, గురజాడ - ముందు నాటకం, తర్వాత కథలు రాసి చివరికి కవిత్వానికి వచ్చారు (తొలినాళ్ళలో ఇంగ్లీషులో కవితలు రాస్తే రాసి ఉండచ్చుగాక, అవి అంత ప్రధానమైనవి కావు). దానికి నాకు తోచే కారణమేమంటే, ఆధునిక యుగ చేతనని ఆయన (బహుశా ఆయన ఒక్కడే) సరిగా అర్థం చేసుకొని, ఆవాహన చేసుకోవడమేనని. వాస్తవికతని అర్థం చేసుకొని 'సత్యం' దిశగా ప్రయాణం చేయడం నేటి అవసరమని గుర్తించింది ఆధునికత. **truth** నుంచి **profounder truth**కి ప్రయాణం చేసే; **logic** ని అధిగమించి **supra logical validity** వైపు ప్రయాణం చేసే 'కవిత్వం' కంటే, వచనం **(Creative prose)** తక్షణావసరమని ఆధునికత గ్రహించింది. ఆ గ్రహింపు గురజాడకు (మాత్రమే) ఉందనిపిస్తోంది. కానీ ఆధునికత తన కోసం సృష్టించుకున్న ఒక సాహిత్య ప్రక్రియ చలం, బుచ్చిబాబు, పద్మరాజు, కొ.కు. ప్రభృతుల్ని మినహాయిస్తే పురిటి దశలోనే

రాలిపోయింది. పోనీ ఆంధ్ర దేశానికి ఐడియాలజీల స్పృహ లేదనుకుందామా.... అంటే ప్రపంచం నలుదిశలా ఎక్కడ వీచిన చిరుగాలికైనా ఇక్కడ వటవృక్షాలు కూలిపోయేంత హంగామా జరుగుతుంది. విశేష ప్రాబల్యం ఉండి పెత్తనం చెలాయించేవి ఒక ట్రెండు భావజాలాలే అయినా, మిగతా ఆలోచనలకు అల్ప సంఖ్యాకంగా అయినా అనుయాయులు ఉంటూనే ఉన్నారు. దాదాపు ప్రతి విభాగం నుంచి (దేనికదే 'స్వతంత్ర' ప్రతిపత్తి గల) మేధోవచనం **(intelectual prose)** ఊరుతూనే ఉంది. తాము ఎంచుకున్న మార్గం పట్ల నిబద్ధత గల వారు, మరే ఇతర ఇజాల దారులవైపు కన్నెత్తి చూడలేదంటేనే ఇక అర్థం చేసుకోవచ్చు ఇక్కడ ఆధునిక చేతనని. ఈ చైతన్య స్థాయిని మరింత సులువుగా గ్రహించడానికి ఒక ఉదాహరణ. వందలాది కులాల, ఉపకులాల నిచ్చెన మెట్ల మన సమాజంలో, ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లు దాదాపు లేవు. అరకొర ఉన్నా, జనసామాన్యం అందులో పాలు పంచుకున్న ఉదంతాలసలే లేవు. ఏ అన్యాయానికైనా ప్రేక్షకులుగానే తప్ప, ప్రతిఘటించేవారుగా మారలేని ప్రజానికం నిండిన దుర్భర భారతీయ సమాజంలో దాదాపు తొలి కదలికగా వచ్చిన ఉద్యమం - మన స్వాతంత్ర్య పోరాటమే. అటువంటి ముఖ్యమైన పోరాటాన్ని గురించి (నెగెటివ్‌గా అయినా) పట్టించుకున్న ఆధునిక కవి ఆంధ్రదేశంలో లేకపోవడమే... ఇక్కడ చైతన్యానికి ఒక దాఖలా.

అటువంటి సందేహాస్పదమైన చైతన్యమే బాసట అయినా, వివిధ సాహిత్యోద్యమాలకి భూమిక అయిన ఈ శతాబ్దపు ఆధునిక / ఉత్తర ఆధునిక / ఆధునికానంతర తెలుగు కవిత్వాన్ని ఒకసారి **Objective** గా సింహావలోకనం చేసుకోవడం అవసరం.

'గతం' లోని సాంప్రదాయిక కవిత్వాన్ని నూరు శాతం రద్దు చేసుకోవడం ద్వారా ప్రారంభమైన ఆధునిక కవితా ప్రస్థానంలో తొలి అడుగు శ్రీశ్రీదేనని చెప్పుకోవచ్చు (తిక్కన, వేమన తనకు గురువులుగా లేదా ఇష్టులుగా ప్రకటించుకోవడం వారి శిల్ప, భావరీత్యా మాత్రమే). పాశ్చాత్య సాహిత్య ప్రపంచంలోని అడుగువంటి అడుగులానే; ఆ స్వానుభవ పరిణామానికి, సహానుభావ అనుకరణలానే... మనమూ వేశాం - **Free Verse** అడుగులు! 'స్వేచ్ఛాభివ్యక్తి'; ఏ గొలుసులూ అడ్డంలేని 'స్వేచ్ఛాభివ్యక్తి' అక్కడ ఫ్రీ వెర్స్ లక్ష్యం.

కవిత్వాన్ని **Short cut** గానే భావించిన మన కవులకు 'స్వేచ్ఛాభ్యక్తి' అనే భావం తృప్తినివ్వలేదు. ఆ భావం కవులకు మాత్రమే సంబంధించినదిగా కనిపించడం వల్ల బహుశా అది నచ్చలేదు. కవికి మాత్రమే సంబంధించిన అంశమైతే అప్పుడది 'వైయక్తికం' అయిపోతుంది కదా. 'సామాజికం', 'ప్రజలు', 'విముక్తి'.... ఇత్యాది అత్యంత మత్తునిచ్చే పదాలు రాజ్యమేలుతున్నందువల్ల తమకు అనుకూలంగా **'Down to earth'** అంటూ ఫ్రీవెర్స్ **Spirit** ని తర్జుమా చేసుకుంది నాటి ఆధునిక సాహిత్యలోకం. '..జగన్నాథ రథ చక్రాలను భూమార్గం పట్టిస్తాన'న్న శ్రీశ్రీకి ఫ్రీవెర్స్ స్ఫూర్తి తెలియదని నేననుకోను. ఏవైతే వర్తమానానికి అంత ఉపయోగకరం కావో వాటిని కన్వీనియెంట్ దాటవేయడం, చూడనట్లు నటించడం, వీలైతే 'మసిబూసి మారేడు కాయ' చేయడం శ్రీశ్రీకి వెన్నతో పెట్టిన విద్యే.

(సశేషం)

# జానపద సాహిత్యంలో - స్త్రీ

- దస్తగిరి

జానపద సాహిత్యానికి జీవం, బలమూ, సొగసూ అంతా దాని వాస్తవిక జీవిత చిత్రణలో వుంది. భావం, భాష, సంఘటనలు, సంభాషణలు అన్నీ జీవితం నుండి ఎగదన్నుకొచ్చినవే. అందువల్లే పల్లెపాటల సాహిత్యం అంటూనే మన ఎదల నిండా ఆత్మీయత, ఆప్యాయత వూరుతాయి. జానపద సాహిత్యంలో వస్తువూ, రూపమూ కలగలసిపోయి మనల్ని మురిపిస్తాయి. ఇందులోని స్వచ్ఛత, స్పష్టత చల్లగాలిలా చల్లని హాయినిస్తాయి. భావాలను యితరులకు అర్థం అయ్యేలా చెప్పడమే భాషకు ముఖ్య ప్రయోజనం అయితే, ఆ పనిని నెరవేర్చిన వాటిలో పల్లె పాటల సాహిత్యమే మొదటి స్థానంలో వుంటుంది.

జానపద సాహిత్యం నిండా పేదప్రజల జీవితమే. కష్టజీవుల జీవితమే. ఈ బడుగు జీవులు తమ జీవితంలోని సుఖదుఃఖాల, రాగద్వేషాల అనుభూతుల్ని పాడుకొనే పాటలే యివి. ఇది లిఖిత సాహిత్యం కాదు. వాగ్రూపం. ఒకరు రాసినవి కావు. సాముదాయకం. ఎవరి అనుభవాలను, అనుభూతులను వారు చేర్చుకుంటూ, మార్చుకుంటూ పాడిన పాటలివి. దీనికి సమాంతరంగా నడచిన రాజాస్థానాల సాహిత్యం, ఎన్ని అలంకారాలు దిగేసి సొగసులు చేసినా, పండితులూ, విశ్వవిద్యాలయాలూ పోటీ కర్రలతో నిలబెట్టినా నిలబడడం కష్టమైంది. కానీ, జానపద సాహిత్యం సొంతంగా నిలబడింది. ఉత్పత్తి కార్యకలాపాలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రజలకు తోడుగా ఉంది. వారి ఉత్తేజ గీతం పల్లెపాట.

కొందరు ప్రచారం చేసినట్లుగా తేలిక సాహిత్యం కాదది. కేవలం బావా మరదళ్ళ, వదినా ఆడపడుచుల సరసోక్తులు, హాస్యోక్తుల పాటలు కావవి. అత్తా కోడళ్ళ, సవతుల తియ్యని కొట్లాటలు కావవి. ఈ పాటలలో ప్రజల కష్టసుఖాల ఆటుపోట్ల జీవితం వుంది. ఘర్షణ వుంది. మంచి జీవితం కోసం తపనవుంది. అనంతపురం జిల్లాలో చాలాచోట్ల నుండి వెయ్యికిపైగా పల్లెపాటలు సేకరించినాను. అందులో చాలా పాటలు అన్ని ప్రాంతాలలోనూ ఒకేలాగ వున్నాయి. కడప జిల్లాలో కూడా కొన్ని పాటలు సేకరించినాను. అక్కడకూడా యిక్కడి పాటలే మార్పులు లేకుండా కొన్ని దొరికినాయి. ప్రాంతాలు వేరైనా బతుకు ఒక్కటే బతుకుగానం ఒక్కటే.

జానపద సాహిత్యంలో స్త్రీ గురించి చెప్పాలంటే ఆమె వున్న కుటుంబం గురించి చెప్పాలి. కుటుంబం సమకాలీన సామాజిక నిర్మాణంలో ఒక కణం. కాబట్టి ఆ కుటుంబం వున్న సమాజం గురించి చెప్పాలి. అది దోపిడి సమాజం. శ్రమ చేసిన వానికి దాని ఫలితం దక్కనీయని సమాజం. ఎడతెరపి లేకుండా కష్టంచేసి, ధాన్యరాసులు సృష్టించినా, కష్టజీవికి ( స్త్రీ, పురుషులు) మింగమెతుకు లేక ఆకలితో అలమటించే సమాజం. ఆధిపత్యం - దాస్య భావజాలంతో కష్టజీవిని కేవలం చాకిరీ చేసే బానిసగా అణచివుంచిన సమాజం. పైగా పురుషాధిపత్య సమాజం. ఈ సామాజిక సంబంధాల చిన్న ప్రతిరూపమే కుటుంబం. భార్య మీద భర్త, కోడలి మీద అత్త, యిలా ఒకరి మీద ఒకరు ఆధిపత్యం చెలాయించడం సామాజిక సంబంధాల ప్రతిరూపమే.

ఇక స్త్రీ విషయానికి వస్తే, యిన్ని విధాలుగా యింత పెద్దయెత్తున హింసకు, క్రౌర్యానికి, వంచనకు, దోపిడీకి గురైనది స్త్రీ తప్ప మరెవ్వరూ కాదు. ఒకరన్నట్లు ఒక కంట రుధిర ధారలు, మరోకంట ప్రేమామృతం - యిదే యుగయుగాల మహిళల జీవితం. సమాజంలో వివిధ కులాలమధ్య, జాతులమధ్య, వర్గాలమధ్య ఎన్ని భేదాలున్నా, ఘర్షణలు వున్నా స్త్రీని అణచివేయడంలో అందరూ

ఒక్కటవుతారు. స్త్రీ - పురుష వివక్షత అనే క్రిమి స్త్రీ జీవితాన్ని చెడతినేసింది. తప్పుచేసిన పురుషుని నేరస్థునిగా శిక్షించదు. ఆ నేరాన్ని ప్రశ్నించిన స్త్రీనే నేరస్థురాలిగా చూస్తుంది.

జానపద సాహిత్యంలోని స్త్రీ పరభాగ్యోపజీవికాదు. ఆమె కష్టజీవి. ఆమె బతికే ప్రతి నిమిషం వీరోచితంగా ఆమె సంపాదించుకొన్నదే. ఆమె పురుషునితో సమవుజ్జీగా కష్టపడి కూలీ చేసి సంపాదిస్తుంది. అదనంగా ఒళ్ళు హూనమయ్యేలా యింటి చాకిరీ చేస్తుంది. అందుకు ప్రతిఫలంగా ఆమెకు లభించే గౌరవం - తిట్లు, చావుదెబ్బలు, అవమానాలు, పస్తులు, వస్తువుల కొరత. నేను పాటలు సేకరించినపుడు ఒకామె చెప్పిన విషయం నాగుండెల్ని యింకా కెలుకుతూనే వుంది. '' ఈ కోడళ్ళకేం (సాహిత్యంలోని కోడలు) నాకత యిను - మా అత్త కడుపునిండా అన్నం తిననిచ్చేది కాదు. సబ్బు చిక్కనిచ్చేది కాదు. అసలు నీల్లు పోసుకోనిచ్చేది కాదు. మంచికోక కట్టుకోనిచ్చేది కాదు. మొగునితో మాట్లాడనిచ్చేది కాదు మహాతల్లీ! సెంబట్టుకొని (బహిర్భూమికి) పోవల్లని, సెంబు తీసుకొని, సెంబులో దాపరికంగా రొట్టె దురుక్కొని పోయి, పోతా పోతా అబుక్కొన, అబుక్కొన తిని ఎవరింట్లోనో నీళ్లిప్పించుకొని కాళ్ళు కడుక్కొని వస్తాంటి''

ఎవరు ఎక్కువ కష్టం చేస్తారో, శ్రమ ఫలితంలో ఎవరికి ఎక్కువ వాటా దక్కాలనో, వారినే ఎక్కువగా అణగదొక్కడం దోపిడీసమాజ లక్షణం. దాని బతుకంతా ఈ దుర్లక్షణం మీదే ఆధారపడివుంది. అణచివేత వున్నచోట నిరసనా వుంటుంది. తిరుగుబాటూ వుంటుంది. సమాజానికి స్త్రీ చాలా నేర్పించింది అంటారు. వ్యవసాయం నేర్పించింది, పాలనా పద్ధతిని నేర్పించింది, దయచూపడం నేర్పించింది, త్యాగం చేయడం నేర్పించింది, అంటారు. బహుశా సరిపోని వాటిని ఎదురించి, ప్రశ్నించే గుణాన్నికూడా స్త్రీయే నేర్పించి వుంటుంది. సంప్రదాయాల పేరిట, ధర్మాలపేరిట, నీతులపేరిట ఆమె నోరు మూయాలని గట్టి ప్రయత్నాలు జరిగినాయి. కానీ అవరోధాలను పెకలించుకొని అరచింది జానపద స్త్రీ. తన బాధలను చెప్పింది. సమకాలీన మానవ సంబంధాలపట్లా, అవి పెడుతున్న బాధలపట్లా తీవ్రమైన అసహనం ప్రదర్శించింది. నిరసించింది. శ్రామికమహిళ కాబట్టే ఆపని చేయగలిగింది. కష్టజీవి కనుకనే, సంపద సృష్టితో సమభాగస్వామి కనుకనే ఆమె అలా అడగగలిగింది. ఆమె చేతలలో స్తబ్ధత లేదు. మాటలలో నిశ్శబ్దం లేదు. ఆమె నిరంతరం చలిస్తూ, జ్వలిస్తూ వుంటుంది.

యిలా పేదరికం, జీవితావసరాల తీవ్రకొరత, కుటుంబ సభ్యుల మధ్య స్నేహ సహకార సంబంధాలకన్నా, ఒకరిపై ఒకరు పెత్తనం చెలాయించే జిలతో వుండటం, ఫ్యాక్షనిజం, పాలెగాళ్ళ దండులోని బతుకు, వైధవ్యం, పురుషునికోనీతి, స్త్రీకోనీతి, యివన్నీ స్త్రీ జీవితాన్ని ఎంత నలుపుతున్నాయో, ఆమె ఎంత అసహనం ప్రకటించిందో జానపద సాహిత్యం మనగుండెలకు చాలా బలంగా తాకుతూ వినిపిస్తుంది.

ఓ విజ్ఞప్తి - జానపదసాహిత్యం ప్రజలు సృష్టించిన ఒకసాంస్కృతికసంపద. దాన్ని కాపాడుకోవాలి. ఇప్పటికే ఎన్నో పాటలు కనుమరుగైనాయి. కొన్ని శిథిలమైనాయి. కొన్ని పాటలు అర్థం పర్థం లేకుండా అర్థాబర్థం మిగిలినాయి. కొన్ని పాటలు అపసవ్యంగా కలగలసి పోయినాయి. కొన్ని పదాలు అరిగిపోయి, అస్పష్టంగా వున్నాయి. కొన్ని పదాలు కరిగిపోయి వాక్యాల మధ్య ఖాళీలు ఏర్పడినాయి. అయినా వున్నవాటిని సేకరించి ఆధునిక పద్ధతులలో భద్రపరచాలి. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయ సంస్థలు, సాంస్కృతిక సంస్థలు బాధ్యతతో దీనికి పూనుకోవాలి.



**Thaleia Prokopiou (right), a Greek actress in the role of a High Priestess, gives the Olympic flame to another priestess during a rehearsal at the temple of Hera in Olympia on Tuesday. - AP/PTI**

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.

